# అగ్రనేత

తెలుగు దిన పత్రిక

TELTEL/2015/66279

రంగారెడ్డి | సంపుటి: 10 సంచిక :43 | ఎడిటర్ : ఉప్పుగల్ల సంతోష్ కుమార్ | తేది: శనివారం 12-04-2025 | పేజీలు:4 వెల: 2.00


## నదిలో కుప్పకూలిన హెలికాప్టర్

న్యూయార్క్,అమెరికాలో ఘోర ప్రమాదం చోటుచేసుకుంది. న్యూయార్క్‌లో ఓ పర్యటక హెలికాప్టర్ ప్రమాదవశాత్తూ నదిలో కుప్పకూలిన ఘటనలో ఓ టెక్ కంపెనీ సీఈఓ, ఆయన కుటుంబం దుర్మరణం పాలయ్యింది. అమెరికా కాలమానం ప్రకారం గురువారం మధ్యాహ్నం ఈ ఘటన చోటు-చేసుకుంది. ఈ ప్రమాదానికి సంబంధించిన దృశ్యాలు సామాజిక మాధ్యమాల్లో వైరల్‌గా మారాయి. ఈ ఘటనపై అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ దిగ్భ్రాంతి వ్యక్తంచేశారు. జర్మనీకి చెందిన దిగ్గజ సీమెన్స్ కంపెనీ స్పెయిన్ విభాగ అధిపతి, సీఈఓ అగస్టన్ ఎస్కోబార్ తన కుటుంబంతో కలిసి న్యూయార్క్ పర్యటనకు వచ్చారు. వీరు ప్రయాణిస్తున్న హెలికాప్టర్ హడ్సన్ నది మీదుగా వెళ్తున్న సమయంలో ప్రమాదానికి గురైంది. గింగిరాలు తిరుగుతూ నదిలో తలకిందులుగా పడిపోయింది. అనంతరం మంటలు చెలరేగడంతో హెలికాప్టర్‌లో ఉన్న ఆరుగురు మృతి చెందారు. వీరిలో ఎస్కోబార్, ఆయన భార్య, ముగ్గురు పిల్లలతో పాటు పైలట్ కూడా ప్రాణాలు కోల్పోయినట్లు అధికారులు వెల్లడించారు.

## పరివార్ కా సాత్.. పరివార్ కా వికాస్ : ప్రతిపక్షాలపై ప్రధాని మోదీ ఫైర్




వారణాసి: ప్రతిపక్ష పార్టీలపై ప్రధాని మోదీ ఫైర్ అయ్యారు. అధికారంపై ఫోకస్ పెట్టిన ప్రతిపక్ష పార్టీ.. కేవలం వాళ్ల స్వంత కుటుంబాలను ప్రమోట్ చేసుకుంటున్నాయని ప్రధాని ఆరోపించారు. సుమారు 3880 కోట్ల విలువైన 44 ప్రాజెక్టులకు ఇవాళ ప్రధాని మోదీ వారణాసిలో శంకుస్థాపన చేశారు. సబ్‌కా సాత్, సబ్ కా వికాస్ అన్న మంత్రంతో తమ ప్రభుత్వం పనిచేస్తున్నదని, ప్రతి పౌరుడి అభ్యుదయం కోసం ముందుకు వెళ్తున్నామన్నారు. కానీ అధికారం కోసం ఎదురుచూస్తున్న వాళ్లు పగలూరాత్రీ రాజకీయ నాటకాలు చేస్తున్నట్లు ఆరోపించారు. జాతీయ ప్రయోజనాలను పక్కనబెట్టి కుటుంబం మొత్తం కుటుంబం డెవలప్మెంట్ కోసం చూస్తోందని విమర్శించారు. అధికారం కోసం రాజకీయాలు చేస్తే వాళ్లు.. పారివార్‌కా సాత్, పరివార్ కే వికాశ్ అన్న రీతిలో వ్యవహరిస్తున్నట్లు ఆరోపించారు.గతంలో పూర్వాంచల్‌లో ఆరోగ్య కేంద్రాలు ఉండేవికావు అని, కానీ ఇప్పుడు కాశీ ఈ ప్రాంతానికి ఆరోగ్య రాజధానిగా మారిందన్నారు. పదేళ్ల క్రితం ఇక్కడ మెడికల్ ట్రీట్మెంట్ తీసుకోవాలంటే కష్టంగా ఉండేదని, కానీ ఇప్పుడు కాశీ హెల్త్ క్యాపిటల్ అయ్యిందన్నారు. ఢిల్లీ, ముంబైకి చెందిన పెద్ద పెద్ద ఆస్పత్రులు ఇప్పుడు కాశీలో అందుబాటులోకి వచ్చినట్లు చెప్పారు. గత పదేళ్లలో బనారస్ వేగంగా మారిందని, కాశీ తన వారసత్వాన్ని కాపాడుకున్నదని, దివ్యమైన భవిష్యత్తు దిశగా వెళ్లోందని, ఇప్పుడు ఇది ప్రాచీన పట్టణం మాత్రమే కాదు అని, ఇది ప్రగతిశీల నగరంగా మారిందన్నారు. పూర్వాంచల్ అభివృద్ధిలో కాశీ కీలక పట్టణంగా మారినట్లు చెప్పారు.

## కాంగ్రెస్ ప్రభుత్వంలో భారీ కుంభకోణాలు




హైదరాబాద్,ఏప్రిల్11: రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం మోసం, విధ్వంసం, దృష్టి మళ్లించడం అనే 3డీ మంత్రంతో పాలన చేస్తున్నదని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ విమర్శించారు. రేవంత్ ప్రభుత్వం ఆర్థిక నేరానికి తెరలేపిందని ఆరోపించారు. కాంగ్రెస్ ప్రభుత్వంలో భారీ కుంభకోణాలు జరుగు తున్నాయని చెప్పారు. కంచ గచ్చిబౌలిలో జరిగిన పర్యావరణ విధ్వంసాన్ని చూసి దేశం మొత్తం విస్తుపోయిందన్నారు. ఆ 400 ఎకరాలు అటవీ భూమేనని, సుప్రీంకోర్టు తీర్పుల ఆధారంగా ఆ విషయాన్ని చెబుతున్నానని స్పష్టం చేశారు. హెచ్‌సీయూ భూముల వెనుక 10 వేల కోట్ల ఆర్థిక కుంభకోణం ఉందన్నారు. కుంభకోణానికి కర్త, కర్మ, క్రియ.. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అంటూ ఆరోపించారు. మహాత్మా జ్యోతిబా పూలే జయంతి సందర్భంగా తెలంగాణ భవన్‌లో ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ.. సీఎం రేవంత్ రెడ్డికి అన్నీ తెలిసే భారీ ఆర్థిక నేరానికి పాల్పడ్డారని మండిపడ్డారు. కంచ గచ్చిబౌలి భూముల వ్యవహారంతో దేశం మొత్తం తెలంగాణ వైపు చూస్తోందన్నారు. ఒక బీజేపీ ఎంపీ సహకారంతో ఈ స్కామ్ చేస్తున్నారని ఆరోపించారు. ఈ వ్యవహారంలో ట్రస్ట్ ఎడ్వైజర్స్ ఇన్వెస్ట్మెంట్ అనే కంపెనీ రేవంత్ రెడ్డికి బ్రోకరిజం చేసిందన్నారు. అందుకు గాను .. సదరు కంపెనీకి రూ.170 కోట్లు లంచం ఇచ్చారన్నారు. సుప్రీంకోర్టు తీర్పులు, ఆర్బీఐ గైడ్‌లైన్సులను తుంగలో తొక్కారని చెప్పారు. అటవీ భూమిని రేవంత్ రెడ్డి ప్రభుత్వం తాకట్టు పెట్టిందన్నారు. అటవీ భూమిని తాకట్టు పెట్టడం, అమ్మే అధికారం ప్రభుత్వానికి కూడా లేదన్నారు. వాల్టా, ఫారెస్టు చట్టాలను కాంగ్రెస్ ప్రభుత్వం ఉల్లంఘించింది. బీజేపీ ఎంపీ సారథ్యంలోనే బ్రోకరేట్ కంపెనీ తీసుకొచ్చారు. ఆ ఎంపీకి రేవంత్ అనుచిత లబ్ధి చేకూరుస్తున్నారు. త్వరలోనే ఆ బీజేపీ ఎంపీ ఎవరో చెబుతానన్నారు. ఈ వ్యవహారంపై కేంద్ర దర్యాప్తు సంస్థలకు లేఖ రాస్తున్నట్లు వెల్లడించారు. కేంద్రం, ఆర్బీఐ, సీబీఐ, సెబీ, ఎస్ఎఫ్ఐవో దర్యాప్తు చేయాలని కోరుతున్నాం. 400 ఎకరాలకు టీ-జీఐఐసీకి యజమాని కాదు. తమది కాని భూమిని టీ-జీఐఐసీ తాకట్టు- పెట్టింది. మోసపూరిత భూమిని తాకట్టు పెట్టుకుని బ్యాంకు రుణం ఇచ్చింది. 400 ఎకరాల భూమి విలువ రూ.5,239 కోట్లు- అని స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్స్ శాఖ చెబుతున్నది. అదే భూమి విలువ రూ.30 వేల కోట్లు- అని రెవెన్యూ శాఖ చెప్పింది. లేని భూమి ఉన్నట్లు చూపి లోన్ తీసుకోవాలని చూశారు. భయంకరమైన ఆర్థిక దోపిడీకి రేవంత్ రెడ్డి పాల్పడుతున్నారు. తమది కాని భూమిని టీ-జీఐఐసీ ఎలా తాకట్టు పెడ్తుందని కెటిఆర్ ప్రశ్నించారు. ప్రధానమంత్రి, కేంద్ర ఆర్థికమంత్రికి తెలియకుండా ఈ వ్యవహారం జరిగిందన్నారు. కేంద్రానికి చిత్తశుద్ధి ఉంటే వెంటేనే సీవీసీ, సీబీఐ విచారణ జరపాలని డిమాండ్ చేశారు. కేంద్రం స్పందించకుంటే కాంగ్రెస్, బీజేపీ మధ్య ఒప్పందం ఉన్నట్లే అంటూ వ్యాఖ్యలు చేశారు. ఆర్బీఐ నిబంధనలు పాటించకుండా.. 10వేల కోట్లు తెచ్చారన్నారు. లిటిగేషన్ భూమికి ఐసీఐసీఐ బ్యాంకు ఎలా లోన్ ఇచ్చిందని ప్రశ్నించారు. ఫీల్డ్ విజిట్ చేయకుండానే బ్రోకర్ ఆధారంగా బ్యాంక్ ప్రభుత్వానికి రుణం ఇచ్చిందని కేటీఆర్ పేర్కొన్నారు.

## అసెంబ్లీలో పూలే విగ్రహం ఏర్పాటు..సిపిఎం మద్దతు కోరిన ఎమ్మెల్సీ కవిత

హైదరాబాద్,ఏప్రిల్11: బహుజనుల సాధికారతకు ప్రతీకగా పూలే విగ్రహాన్ని అసెంబ్లీ ఆవరణలో ప్రతిష్టించాలని బీఆర్ఎస్ ఎమ్మెల్సీ, జాగృతి అధ్యక్షురాలు కవిత డిమాండ్ చేశారు. అసెంబ్లీలో పూలే విగ్రహ ఏర్పాటు సాధనకై అనేక కార్యక్రమాలు చేపట్టి ప్రజల మద్దతు కూడగట్టామన్నారు. రిజర్వేషన్లకు 50 శాతం పరిమితి అడ్డంకి తొలగిపోయిందని చెప్పారు. ఈడబ్ల్యూఎస్ రిజర్వేషన్ అమలుతో తొమ్మిది రాష్ట్రాల్లో 50 శాతానికి పైగా రిజర్వేషన్లు అమలవుతున్నాయని, అందువల్ల బీసీలకు 42 శాతం రిజర్వేషన్ల బిల్లును కేంద్రం ఆమోదించాలన్నారు. దీనికోసం రాష్ట్ర ప్రభుత్వం కేంద్రంపై ఒత్తిడి చేయాలన్నారు. మహాత్మ జ్యోతిరావు పూలే జయంతి సందర్భంగా హైదరాబాద్ మింట్ కాంపౌండ్ వద్ద ఆయన విగ్రహానికి పూలమాల వేసి అంజలి ఘటించారు. అనంతరం అసెంబ్లీ ఆవరణలో పూలే విగ్రహ ఏర్పాటు-కు సీపీఎం కార్యదర్శి జాన్ వెస్లీ మద్దతు కోరారు. ఈ సందర్భంగా కవిత మాట్లాడుతూ.. తక్షణమే ప్రధానమంత్రి అపాయింట్‌మెంట్ తీసుకొని రాష్ట్ర ప్రభుత్వం అఖిలపక్షాన్ని ఢిల్లీ తీసుకెళ్లాలన్నారు. కుల గణన వివరాలను గ్రామ పంచాయతీల వారీగా బహిర్గతం చేయాలని డిమాండ్ చేశారు. పూలే విగ్రహాన్ని అసెంబ్లీ ఆవరణలో ఏర్పాటు- చేయాలన్న ఎమ్మెల్సీ కవిత ప్రతిపాదన అభినందనీయమని సీపీఎం కార్యదర్శి జాన్ వెస్లీ అన్నారు.



కవిత పోరాటానికి పూర్తి మద్దతు ప్రకటిస్తున్నామని చెప్పారు. కుల అసమానతలను నిర్మూలించకుండా దేశం అభివృద్ధిలో ముందుకు వెళ్లదని తమ నమ్మకమని తెలిపారు. కుల అసమానతలకు వ్యతిరేకంగా పోరాటం చేసిన పూలే విగ్రహం అసెంబ్లీలో ఏర్పాటు- చేయాల్సిందేనని అన్నారు. ఎమ్మెల్సీ కవిత డిమాండ్ మేరకు రాష్ట్ర ప్రభుత్వం కులగణన వివరాలను బహిర్గతం చేయాలన్నారు. దేశవ్యాప్తంగా కులగణన చేయాలని కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

## పూలే ఆశయాలను కొనసాగిస్తాం : ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి



మహబూబ్ నగర్ : మహాత్మ జ్యోతిబా పూలే ఆశయాలను కొనసాగిస్తామని మహబూబ్ నగర్ ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి పేర్కొన్నారు. పూలే జయంతి సందర్భంగా మహబూబ్ నగర్ పట్టణం, పద్మావతి కాలనీలోని గ్రీన్ బెల్ట్ లో పూలే విగ్రహానికి ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాసరెడ్డి, జిల్లా కలెక్టర్ విజయేందిర బోయి, అధికారులు, బీసీ సంఘాల నాయకులు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు.ఎమ్మెల్యే మాట్లాడుతూ ఇంట్లో ఒక్క మహిళ చదువుకుంటే ఆ ఇంట్లో మొత్తం విద్యావంతులు తయారవుతారని నమ్మిన వ్యక్తి పూలే అని వెల్లడించారు. బ్రిటిష్ కాలంలోనే భారతీయ పిల్లలు చదువుకోవాలని సొంత డబ్బులతో పాఠశాలలు ఏర్పాటు చేసి ఉచితంగా విద్యను అందించారని, బడుగు, బలహీన వర్గాలకు కూడా విద్యలో సమాన అవకాశాలు ఉండాలని భావించారని వివరించారు. విద్య మీద ప్రజా ప్రభుత్వం దృష్టి పెట్టిందంటే దానికి స్ఫూర్తి జ్యోతిబాపూలేనని అన్నారు .జిల్లా కలెక్టర్ విజయేందిర బోయి మాట్లాడుతూ అంటరానితనం నిర్మూలన, కుల వివక్షత, మహిళ విద్యకు కృషి చేసిన జ్యోతిబాపూలే మహనీయుడని అన్నారు . వారి త్యాగాల ఫలితంగానే సమాజంలో మార్పులు వచ్చాయని, మహాత్మ జ్యోతిబాపూలే ఆశయాలను ప్రతి ఒక్కరూ ముందుకు తీసుకు వెళ్లాలని అన్నారు.ఈ సందర్భంగా బీసీ స్టడీ సర్కిల్ లో శిక్షణ పొందిన నాగర్ కర్నూల్ జిల్లాకు చెందిన శ్రీకాంత్ గ్రూప్ 1 లో ఎంపిక అయినందుకు సన్మానించారు. ఈ కార్యక్రమంలో ముడా చైర్మన్ లక్ష్మణ్ యాదవ్, మార్కెట్ కమిటీ చైర్మన్ బెక్కెరి అనిత మధుసూదన్ రెడ్డి , బీసీ సంక్షేమ శాఖ అధికారి ఆర్ ఇందిర, డీపీఆర్‌వో శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

అచ్చంపేట రూరల్‌లో..

అచ్చంపేట వ్యవసాయ మార్కెట్ కమిటీ కార్యాలయంలో మహాత్మా జ్యోతిరావు పూలే జయంతి ని ఘనంగా నిర్వహించారు. మార్కెట్ కమిటీ చైర్ పర్సన్ అంతటి రజిత పూలెచిత్రపటానికి పూలమాల వేసిన నివాళులర్పించారు ఈ కార్యక్రమంలో వ్యవసాయ మార్కెట్ కమిటీ డైరెక్టర్లు శివశంకర్, కృష్ణ, వెంకటేష్, వేరుశెనగ కొనుగోలు వ్యాపారస్తులు, కమిషన్ దారులు . నాయకులు రాజ్ గోపాల్, రాములు, జగదీశ్వర్, వ్యవసాయ మార్కెట్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## అమెరికా వస్తువులపై 125% సుంకాలు పెంచిన చైనా..



వాషింగ్టన్, అమెరికా, చైనా మధ్య వాణిజ్య యుద్ధం ముదురుతోంది. డొనాల్డ్ ట్రంప్ చైనాని టార్గెట్ చేస్తూ సుంకాలను పెంచారు. మిగతా ప్రపంచ దేశాలకు అమెరికా మూడు నెలలు పాటు టారిఫ్స్‌ని నిలిపేసింది.కానీ, చైనాకు మాత్రం అమెరికా ఎలాంటి వెసులుబాటు ఇవ్వలేదు. చైనా ఉత్పత్తులపై యూఎస్ విపరీతమైన సుంకాలను విధించింది. ఇదిలా ఉంటే, చైనా కూడా అంతే ధీటుగా అమెరికా వస్తువులపై సుంకాలను పెంచుతూ పోతోంది. తాజాగా, యూఎస్ వస్తువులపై సుంకాలను 84 శాతం నుంచి 125 శాతానికి పెంచుతామని చైనా శుక్రవారం తెలిపింది.మరోవైపు, శనివారం నుంచి చైనా ఉత్పత్తులపై అమెరికా విధించిన సుంకాలు 145 శాతం అమలులోకి వస్తున్నాయి. అమెరికా నిర్ణయానికి ధీటుగా చైనా కూడా స్పందిస్తోంది. దీంతో రెండు దేశాల మధ్య వాణిజ్య యుద్ధం మరింత తీవ్రమైంది. "చైనాపై అమెరికా అసాధారణంగా అధిక సుంకాలను విధించడం అంతర్జాతీయ వాణిజ్య నియమాలను, ప్రాథమిక ఆర్థిక చట్టాలను, కామన్ సెన్స్‌ని తీవ్రంగా ఉల్లంఘిస్తోందని" బీజింగ్ స్టేట్ కౌన్సిల్ టారిఫ్ కమిషన్ ఆర్థిక మంత్రిత్వ శాఖ పంచుకున్న ఒక ప్రకటనలో తెలిపింది. ట్రంప్ విధిస్తున్న సుంకాల వల్ల ప్రపంచ ఆర్థిక వ్యవస్థ అల్లకల్లోలంగా మారిందని, దీనికి పూర్తిగా అమెరికానే బాధ్యత వహించాలని చైనా చెప్పింది.చైనాను మినహాయించి, అన్ని దేశాలపై అమెరికా సుంకాలను 90 రోజుల పాటు విరామం ప్రకటించింది. బీజింగ్ నుంచి తగిన గౌరవం లేకపోవడం కారణంగా చనా దిగుమతులపై సుంకాలను పెంచుతున్నట్లు ట్రంప్ చెప్పాడు. చైనా పర్యటనకు వచ్చిన స్పానిష్ దేశాధినేతను జి జిన్ పింగ్ కలిసిన తర్వాత ఆయన మాట్లాడుతూ.. వాణిజ్య యుద్ధాల్లో విజేతలు ఎవరూ ఉండరని అన్నారు. అమెరికాతో పెరుగుతున్న వాణిజ్య యుద్ధం నుంచి బయటపడటానికి చైనా అధ్యక్షుడు యూరోపియన్ యూనియన్ తమతో సహకరించాల్సిన అవసరం ఉందని చెప్పారు.

## యాక్టింగ్ సీఎంగా రేవంత్.. యాక్టివ్ రూరల్స్‌గా బాబు, మోదీ

నేరేడుచర్ల, ఏప్రిల్ 11 : రేవంత్ రెడ్డి రాష్ట్రానికి యాక్టింగ్ సీఎంగా వ్యవహరిస్తున్నారని, ప్రధాని మోదీ, ఏపీ సీఎం చంద్రబాబు కనుసన్నల్లో తెలంగాణలో పాలన కొనసాగుతుందని బీఆర్ఎస్ హుజూర్‌నగర్ నియోజకవర్గ సమన్వయకర్త ఒంటెద్దు నర్సింహారెడ్డి అన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి వ్యవహార శైలి ఇందుకు నిదర్శనగా ఉందన్నారు. శుక్రవారం నేరేడుచర్లలోని బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. చంద్రబాబు నరహంతక పాలనలో బషీర్‌బాగ్ కాల్పుల ఉదంతం, అనంతరం కేసీఆర్ ఎంతో మేధోమదనం చేసి తన సర్వాధికారాలు వదులుకుని ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర సాధనే లక్ష్యంగా 21 ఏప్రిల్ 2001న బీఆర్ఎస్ పార్టీ స్థాపించారని గుర్తు చేశారు. తెలంగాణ ప్రజలను, మేధావులను, విద్యార్థులను ఒకేతాటి పైకి తీసుకువచ్చి ఉద్యమ స్ఫూర్తిని రగిలించి తెలంగాణ వచ్చుడో.. కేసీఆర్ సచ్చుడో అంటూ చేసిన పోరాటాలే ఫలితాలు ఇచ్చినట్లు తెలిపారు. అలాంటి ఉద్యమ నేతతో మీకు పోలికా అని కాంగ్రెస్, బీజేపీ నేతలను విమర్శించారు.ఎత్తు పల్లాలు, పడి లేవడాలు, ఎన్నో ఒడిదుడుకులు ఎదుర్కొని సాధించుకున్న తెలంగాణలో పదేండ్ల పాటు స్వర్ణ యుగంగా పాలన కొనసాగిందన్నారు. 16 నెలల పాలనలో కాంగ్రెస్ పార్టీ ఏమి చెప్పిందో, ఏమి చేసిందో ప్రజలకు వివరిస్తామన్నారు. తెలంగాణ రాష్ట్రంతో పాటు తెలంగాణ ప్రజలు సురక్షితంగా ఉండాలంటే మళ్లీ కేసీఆర్ ముఖ్యమంత్రిగా రావాల్సిన ఆవశ్యకత ఉందన్నారు. అత్యంత ప్రతిష్టాత్మకంగా ఏప్రిల్ 27న వరంగల్ పట్టణంలో నిర్వహించే బీఆర్ఎస్ రజతోత్సవ సభను విజయవంతం కోరుతూ ఈ నెల 14న హుజూర్ నగర్ పట్టణంలో నిర్వహించే సన్నాహక సమావేశాన్ని జయప్రదం చేయాలని ఆయన కోరారు. అనంతరం ఛలో వరంగల్ పోస్టర్ ని ఆవిష్కరించారు. అంతకుముందు జ్యోతిబాపూలే పూలే జయంతిని పురస్కరించుకుని పూలే చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సమావేశంలో బీఆర్ఎస్ నేరేడుచర్ల మండలాధ్యక్షుడు అరిబండి సురేష్ బాబు, డీసీసీబీ డైరెక్టర్ దొండపాటి అప్పిరెడ్డి, మాజీ ఎంపీపీలు లకుమల్ల జ్యోతి భిక్షం, చెన్నబోయిన



సైదులు , మాజీ మున్సిపల్ చైర్మన్ చందమల్ల జయబాబు, పట్టణ ప్రధాన కార్యదర్శి చిత్తలూరి సైదులు, టౌన్ యూత్ అధ్యక్షుడు పోకబత్తిని రాజేశ్, నాయకులు కొణతం లచ్చిరెడ్డి, ఇనపాల పిచ్చిరెడ్డి, ఇంజమూరి రాములు, పంగ శ్రీను, రాపోలు నవీన్, బొడ్డుపల్లి సుందరయ్య, తాళ్లూరి సాయి, చిట్యాల శ్రీను, పల్లెపంగు నాగరాజు, శ్రీను నాయక్, లకుమల్ల రవీందర్, ఇంజమూరి శ్రీను, ఇంజమూరి రాజేశ్ పాల్గొన్నారు.

## తమిళనాడు బీజేపీ చీఫ్‌గా నాగేంద్రన్..అధికారికంగా ప్రకటించే అవకాశాలు

చెన్నై:తమిళనాడు బీజేపీ చీఫ్‌గా అన్నామలై వారసుడిగా నైనార్ నాగేంద్రన్ రానున్నట్లు సమాచారం. ప్రస్తుతం కేంద్ర హోంమంత్రి అమిత్ షా చెన్నైలో పర్యటిస్తున్నారు.అన్నామలై వారసుడిని అధికారికంగా శనివారం ప్రకటించే అవకాశాలు ఉన్నాయి.అన్నామలై.. బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడిగా ఉన్న సమయంలో జయలలితపై చేసిన అనుచిత వ్యాఖ్యలు కారణంగా అన్నాడీఎంకేతో బీజేపీ సంబంధాలు దెబ్బకొట్టాయి. అయితే వచ్చే ఏడాదే తమిళనాడులో అసెంబ్లీ ఎన్నికలు జరగనున్నాయి.

ఈ నేపథ్యంలో అన్నాడీఎంకేతో సంబంధాలు అవసరం. దీనికి అన్నామలై అడ్డంకి మారడంతో ఇటీవల అధ్యక్ష పదవి నుంచి వైదొలిగారు. దీంతో కొత్త అధ్యక్షుడి కోసం బీజేపీ అధిష్టానం తీవ్ర కసరత్తు చేసింది. తిరిగి కూటమి బలపడాలటే నాగేంద్రన్ అయితే కరెక్ట్ అని కాషాయ పార్టీ భావిస్తోంది. అతని వైపు హైకమాండ్ మొగ్గు చూపుతోంది.నాగేంద్రన్.. గతంలో అన్నాడీఎంకేలో కీ రోల్ పోషించారు. జయలలిత మరణం తర్వాత 2016లో అన్నాడీఎంకేను విడిచిపెట్టి బీజేపీలో చేరారు. 2021లో బీజేపీ-అన్నాడీఎంకే కూటమిలో భాగంగా తిరునల్వేలి అసెంబ్లీ స్థానం నుంచి పోటీ చేసి గెలిచి శాసనసభ పక్ష నాయకుడిగా ఎన్నికయ్యారు. అన్నాడీఎంకేతో మంచి సంబంధాలు ఉన్న కారణాన నాగేంద్రన్ అయితే.. కూటమి బలపడుతుందని బీజేపీ భావిస్తోంది. ఈయన పేరు శనివారం సాయంత్రం అధికారిక ప్రకటన వెలువడే అవకాశం ఉంది. శుక్రవారం నాగేంద్రన్ అధ్యక్ష పోటీకి నామినేషన్ వేయనున్నారు. ఇక



అధ్యక్ష రేసులో లేనట్లుగా అన్నామలై ఇప్పటికే ప్రకటించారు. సాధారణ కార్యకర్తగా కొనసాగుతానని వెల్లడించారు.

బీజేపీ చీఫ్ కావడానికి ప్రమాణాలివే..

తమిళనాడు బీజేపీ చీఫ్‌గా పోటీ చేయాలంటే బీజేపీ ప్రాథమిక సభ్యులుగా కనీసం 10 సంవత్సరాలు పని చేసి ఉండాలి. మూడు సంస్థాగత ఎన్నికల్లో పాల్గొని ఉండాలి. రాష్ట్ర జనరల్ కౌన్సిల్‌లో ఎన్నికై 10 మంది సభ్యులచే లిఖితపూర్వకంగా ఆమోదించబడి ఉండాలి. ఇక అధ్యక్ష రేసులో తమిళిసై పేరు వినిపించింది కానీ.. హైకమాండ్ మాత్రం నాగేంద్రన్ వైపే మొగ్గు చూపినట్లుగా వార్తలు వినిపిస్తున్నాయి.

### తెలంగాణలో పిడుగుపాటుకు ఇద్దరు మృతి

హైదరాబాద్,తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా గురువారం వర్షం బీభత్సం సృష్టించింది. కొన్ని ప్రాంతాల్లో వడగళ్ల వర్షం కూడా కురిసింది. అయితే భారీ వర్షం ధాటికి పలు ప్రాంతాల్లో పిడుగులు కూడా పడ్డాయి. రెండు వేర్వేరు ప్రాంతాల్లో పిడుగులు పడటంతో ఇద్దరు మృత్యువాత పడ్డారు. సంగారెడ్డి జిల్లాలో ఓ కళాశాల విద్యార్థి పిడుగుపాటు-కు మరణించాడు. కొండాపూర్ మండలం గంగారం గ్రామానికి చెందిన సంతోష్ కాలేజీకి వెళ్లి వస్తుండగా.. భారీ వర్షం పడటంతో చెట్టు-కిందకు వెళ్లాడు. చెట్టు- కింద ఉన్న సమయంలో పిడుగుపడి సంతోష్ మృతి చెందాడు. మరోవైపు నల్గొండ జిల్లా గుర్రంపోడు మండలం ఆములూరులో చిన్న రాములు అనే వ్యక్తి పిడుగుపాటు-కు మృతి చెందాడు.

# సవాళ్లకు అనుగుణంగా పోలీస్ శాఖ సన్నద్ధం

హైదరాబాద్,వాణిజ్య రంగంలో మారుతున్న సవాళ్లకు తగిన విధంగా స్పందించేందుకు తెలంగాణ పోలీస్ శాఖ ముందడుగు వేస్తోందని డీజీపీ జితేందర్ తెలిపారు. ముఖ్యంగా సైబర్ ఫ్రాడ్ నేరాలను అరికట్టేందుకు ఐజీ ర్యాంక్ అధికారిని ప్రత్యేకంగా నియమించామన్నారు. గంజాయి, డ్రగ్స్ నియంత్రణ కోసం నార్కోటిక్స్ బ్యూరో ఏర్పాటుచేసినట్లు వెల్లడించారు. పరిశ్రమల్లో మహిళా ఉద్యోగుల రక్షణ కోసం షీ టీ-మ్‌ను ఏర్పాటు చేయడం, వారి ప్రయాణ సౌకర్యార్థం షీ షటిల్ బస్సులు అందుబాటులోకి తేవడం వంటి చర్యలను వివరించారు. తెలంగాణ వాణిజ్య, పరిశ్రమల సమాఖ్య ఆధ్వర్యంలో మెరుగైన పోలీస్ నిఘా , ప్రజా భద్రతపై రాష్ట్ర డీజీపీ జితేందర్‌తో కీలక సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో సాంకేతిక పోలీసింగ్, సైబర్ భద్రత, మహిళా ఉద్యోగుల రక్షణ, ప్రభుత్వ-ప్రైవేట్ రంగాల భద్రతా సహకారంపై చర్చ జరిగింది. ఈ సమావేశంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న డీజీపీ జితేందర్ మాట్లాడుతూ, ప్రభుత్వ-ప్రైవేట్ రంగాల మధ్య భద్రత విషయంలో అంతరాన్ని తగ్గించడమే ఈ సమావేశ ఉద్దేశం అన్నారు. పరిశ్రమల భద్రతకు అధిక ప్రాధాన్యత ఇస్తామని చెప్పారు. వేధింపులపై చట్టపరమైన చర్యలు తీసుకుంటు-న్నామన్నారు. గత ఐదేళ్లలో తెలంగాణ ప్రభుత్వం పోలీస్ శాఖకు రూ.800 కోట్లు మంజూరు చేసినట్లు- జితేందర్ తెలిపారు. 100 డయల్ సేవలు మెరుగు పడటంతోపాటు పోలీస్ పనితీరు దేశంలోనే కాక, అంతర్జాతీయంగా ప్రశంసలందుకుంటోందని పేర్కొన్నారు. తెలంగాణలో అన్ని రంగాల అభివృద్ధి పోలీస్ భద్రతపై ఆధారపడి ఉంది. శాంతి భద్రతలను కాపాడడంలో మా బాధ్యతను నిజాయితీగా నిర్వర్తిస్తున్నాం, అని డీజీపీ జితేందర్ తెలిపారు. ఈ సమావేశం వాణిజ్య, పరిశ్రమల రంగం నుంచి విశేష స్పందన పొందింది. భద్రత , నిఘాపై ప్రభుత్వ నిర్ణయాలు పరిశ్రమల విశ్వాసాన్ని పెంచుతున్నాయనే అభిప్రాయం వ్యక్తమైంది.

# కడియం శ్రీహరి రాజకీయ కృతఘ్నుడు

జనగామ,స్టేషన్ ఘన్‌పూర్ రాజకీయం మరింత రసవత్తరంగా మారింది. బుధవారం మీడియా సమావేశంలో ఎమ్మెల్యే కడియం శ్రీహరి పై మాజీ ఎమ్మెల్యే తాటికొండ రాజయ్య తీవ్ర విమర్శలు గుప్పించారు. రాజకీయ వేదికపై ఈ స్థాయి వ్యక్తిగత వ్యాఖ్యలు కావడం హాట్ టాపిక్‌గా మారింది. తాటికొండ రాజయ్య చేసిన వ్యాఖ్యలు రాజకీయ వర్గాల్లో కలకలం రేపుతున్నాయి. ఆయన మాట్లాడుతూ, చనిపోయిన పాము కొస తోకకు ప్రాణం ఉన్నట్టు కడియం రాజకీయం ఉండేది అంటూ ఘాటుగా స్పందించారు. కడియం శ్రీహరికి రాజకీయ జన్మ ఇవ్వడంలో ముందుగా కేసీఆర్ పాత్ర ఉందని, రెండోసారి పల్లా రాజేశ్వర్ రెడ్డి సహకారంతోనే ఆయనకు ఎమ్మెల్యే టికెట్ లభించిందని రాజయ్య పేర్కొన్నారు. అలాగే, స్టేషన్ ఘన్‌పూర్ అభివృద్ధిలో పల్లా రాజేశ్వర్ రెడ్డి పాత్రను ప్రస్తావిస్తూ, వేడినీళ్లకు చన్నీళ్ల లాగా రాజేశ్వర్ రెడ్డి వ్యవహరించారు. అభివృద్ధి విషయాల్లో ఆయన పాత్ర గణనీయమైందని అన్నారు. కేసీఆర్ మాటల్లో ఎప్పుడూ కడియం పేరు రాలేదని, అయినప్పటికీ ఆయన తన స్థాయిని మరిచి ప్రెస్ మీట్‌లో సంబంధం లేని విషయాలు మాట్లాడుతున్నారని విమర్శించారు. ఇక కడియం శ్రీహరి పాలన గురించి మాట్లాడుతూ, ఇప్పుడిది ప్రజాస్వామ్యం కాదు, అక్రమ అరెస్టులతో ఒక వర్గానికి అనుకూలంగా పాలన సాగుతోంది. ప్రజల స్వేచ్ఛలు హరించబడుతున్నాయని ఆరోపించారు. అంతేకాకుండా... రాజకీయ జన్మనిచ్చిన స్టేషన్ ఘన్‌పూర్ ప్రజలకు జీవితాంతం గులామ్‌గిరి చేయాల్సిన బాధ్యత నీ మీద ఉంది అంటూ రాజయ్య హెచ్చరించారు. ఆయన కడియంపై ఆస్తుల విషయమై కూడా ఆరోపణలు చేశారు. దేవనూరు పరిసర ప్రాంతాల్లో బినామీ పేర్లతో భూములు ఉన్నాయా? కుటుంబంతో కలిసి పాలేరు ప్రాంతంలో వ్యవసాయం చేస్తున్నావా?' అంటూ ప్రశ్నలు సంధించారు. మొత్తం 23 మంది రైతులకు చెందిన 43 ఎకరాల 38 గుంటల భూమిని బినామీ పేర్లతో స్వాధీనం చేసుకున్నారని పేర్కొంటూ, ఇది వాస్తవం కాదా? అంటూ రాజయ్య నిలదీశారు. నీవు పతనమవుతున్న వ్యక్తివి అంటూ వ్యంగ్యంగా వ్యాఖ్యానించారు.

# టిడిపి నేతల వ్యాఖ్యలు గర్హనీయం

గుంటూరు, ఇటీవల లింగమయ్య హత్య అనంతర పరిణామాలపై టీడీపీ నేతలు చేస్తున్న విమర్శలపై వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నేత, మాజీ మంత్రి అంబటి రాంబాబు ఘాటుగా స్పందించారు. ముఖ్యమంత్రి జగన్ పై రౌడీ, సైకో అంటూ టీడీపీ నేతలు వ్యాఖ్యానిస్తున్న తీరును ఆయన తీవ్రంగా ఖండించారు. ఈ మేరకు అంబటి రాంబాబు మరోసారి సంచలన వ్యాఖ్యలు చేశారు. వీళ్ళు వీళ్ళ ఇష్టం వచ్చినట్లు- మాట్లాడతారా? అంటూ ప్రశ్నించిన అంబటి, చంద్రబాబు గతంలో ఇచ్చిన హామీలను నిలబెట్టుకోలేదని, ఆయనకే చీటర్ బిరుదు సరిపోతుందని వ్యాఖ్యానించారు. అంబటి మాట్లాడుతూ, రాష్ట్రంలో హత్యలు, హత్యా యత్నాలు జరుగుతున్నాయని, అయితే పోలీసులు వాటిపై సరైన చర్యలు తీసుకోవడం లేదని ఆరోపించారు. కొంతమంది పోలీసులకు అసలు పోస్టింగ్‌లు ఇవ్వరు, కోర్టు వెళ్లినా తప్ప కేసులు నమోదు చేయడం లేదుని అన్నారు. అంతేకాదు, ఆయన తానే వ్యక్తిగతంగా కేసుల నమోదు విషయంలో అడిగితే తనపైనే కేసులు పెట్టారని ఆవేదన వ్యక్తం చేశారు. అంబటి తన వ్యాఖ్యలలో డీజీపీపై కూడా అసంతృప్తి వ్యక్తం చేశారు. అనుమతి తీసుకుని కలుసుకోవడానికి వెళ్ళినా ఆయన కలవలేదని అంటూ వ్యాఖ్యానించారు. పోలీస్ వ్యవస్థ కొంతమందికి మాత్రమే సేవలందిస్తోందని ఆరోపించిన ఆయన, అలాంటి వారిని బట్టలూడదీసి నిలబెడతామని అంటూ హెచ్చరించారు. ముఖ్యమంత్రి జగన్ ఇటీవల కొన్ని పోలీసు వర్గాలకు హెచ్చరికలు జారీ చేసిన విషయాన్ని గుర్తు చేసిన అంబటి, జగన్ ఒక్క సెక్షన్ పోలీసుల గురించి మాత్రమే అన్నారు. గతంలో చంద్రబాబు, లోకేష్, అచ్చెన్నాయుడు ఎలా మాట్లాడారో ప్రజలందరికీ గుర్తుందని అన్నారు.

# తోపుదర్తి ప్రకాశ్ రెడ్డిపై కేసు నమోదు

అనంతపురం, వైకాపా మాజీ ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాశ్‌రెడ్డిపై కేసు నమోదైంది. శ్రీసత్యసాయి జిల్లా రామగిరి పోలీసులు ఆయనపై కేసు నమోదు చేశారు. ఇటీవల పాపిరెడ్డిపల్లెలో వైకాపా అధ్యక్షుడు జగన్ పర్యటన సందర్భంగా హెలికాప్టర్ వద్ద తోపులాట జరిగిన విషయం తెలిసిందే. ఈ ఘటనలో కొంతమంది వైకాపా కార్యకర్తలు రాళ్లదాడికి పాల్పడటంతో పలువురు పోలీసులకు గాయాలయ్యాయి. గాయపడిన కానిస్టేబుల్ ఫిర్యాదుతో గురువారం తోపుదుర్తిపై పోలీసులు కేసు నమోదు చేశారు. జగన్ భద్రతపై పోలీసులు చేసిన సూచనలను మాజీ ఎమ్మెల్యే పాటించలేదని కానిస్టేబుల్ తన ఫిర్యాదులో పేర్కొన్నారు. జగన్ హెలికాప్టర్ దిగకముందే వైకాపా కార్యకర్తలు దూసుకొచ్చారన్నారు. ఆపై హెలికాప్టర్‌పై పిడిగుద్దులు గుద్దినట్లు- ఫిర్యాదులో పేర్కొన్నారు. హెలిప్యాడ్ వద్ద కార్యకర్తలను తోపుదుర్తి రెచ్చగొట్టినట్లు-.. భద్రతా వైఫల్యంగా చూపేందుకు

# జగన్‌కు ధర్మాన బ్రదర్స్ సడన్ షాక్..

శ్రీకాకుళం: ఉమ్మడి శ్రీకాకుళం జిల్లా వైసీపీలో ఆ ముగ్గురు అన్నీ తామే అన్నట్లు వ్యవహరించారు. దశాబ్దాల రాజకీయ అనుభవం ఉన్న ఆ ముగ్గురు సీనియర్లు పార్టీ అధికారంలో ఉన్నంత కాలం గట్టిగానే చక్రం తిప్పారు. రాజకీయాల్లో ఎన్నో ఒడిదుడుకులు ఎదుర్కొన్న ఆ దిగ్గజాలు గత ఎన్నికల్లో ఓటమి తర్వాత ఇంటి గడప దాటకపోతుండటం చర్చనీయాంశంగా మారింది. సడన్‌గా ధర్మాన సోదరులు, తమ్మినేని సీతారాంకి అంత రాజకీయ వైరాగ్యం ఎందుకొచ్చింది?.. ప్రజాక్షేత్రానికి దూరంగా ఉంటున్న ఆ దిగ్గజాలు ఇక రాజకీయాలకు కూడా గుడ్‌బై చెప్పేస్తారా? వారి మౌనంపై సిక్కోలు వైసీపీ క్యాడర్లో వ్యక్తమవుతున్న అభిప్రాయం ఏంటి?

ప్రజలకు ముఖం చాటేస్తున్న సిక్కోలు వైసీపీ సీనియర్లు

ఎన్నికలు వస్తుంటాయి.. పోతుంటాయి. పార్టీలు గెలుస్తాయి, ఓడిపోతాయి. ఒకప్పుడు పరాజయం పాలైన పార్టీల నేతలు పవర్‌లోకి రావడానికి పట్టుదలతో పావులు కదిపేవారు. కానీ ప్రస్తుతం రాజకీయాలు బాగా మారిపోయాయి. రాజకీయనాయకులు అధికారంలో ఉంటే ఒకలాగా.. లేకపోతే మరోలాగా వ్యవహారిస్తున్నారు . అధికారంలో ఉన్నప్పుడు అన్నిభోగాలు అనుభవించిన నాయకులు అధికారం లేకపోయేసరికి ప్రజలకు, పార్టీ శ్రేణులకు ముఖం చాటేసి తిరుగుతున్నారు. శ్రీకాకుళం జిల్లాలో వైసీపీ నేతల పరిస్థితి అదే విధంగా తయారైంది.

అధికారం ఉన్నప్పుడు అన్నీ తామే అన్నట్లు వ్యవహరించిన నేతలు

2019 ఎన్నికల్లో ఉమ్మడి జిల్లాలోని పది నియోజకవర్గాలలో తొమ్మిది నియోజకవర్గాలను వైసీపీ కైవసం చేసుకుంది. అధికారం చెలాయించిన వైసీపీలో ఎక్కడ చూసినా అన్నీ తామే అనేలా వ్యవహరించిన సిక్కోలు జిల్లా బడా నేతలు .. మొన్నటి ఎన్నికలో ఓడిపోయేసరికి ఒక్కసారిగా.. పిన్‌డ్రాప్ సైలెన్స్ మెయిన్‌టెయిన్ చేస్తున్నారు. వైసీపీ అధ్యక్షుడు జగన్ ముఖ్యమంత్రి హోదాలో జిల్లా పర్యటనకు వచ్చినప్పుడు నియోజకవర్గంతో తేడా లేకుండా ఆ బడా నేతలే అయనకి కుడి పక్క.. ఎడమ పక్క దర్శనమిచ్చేవారు. 2024 ఎన్నికల్లో కూటమి ప్రభంజనంలో వైసీపీ ఉమ్మడి శ్రీకాకుళం జిల్లాలో తుడిచి పెట్టుకుపోయింది.

సామాజికంగా, ఆర్థికంగా బలమైన పునాదులు ఉన్న సీనియర్లు

దాంతో అప్పటి దాకా రాజసం వెలగబెట్టిన మాజీ మంత్రులు ధర్మాన ప్రసాదరావు, ధర్మాన కృష్ణదాస్, సిదిరి అప్పలరాజులతో పాటు అప్పట్లో స్పీకర్‌గా పనిచేసిన తమ్మినేని సీతారాంలు ఒక్కాసారిగా సైలెంట్ అయిపోయారు. అసలు రాజకీయాల్లో ఉన్నారా? లేదా ? అన్నట్లు వ్యవహరిస్తున్నారు. దాంతో బలం అనుకున్నవారే బలహీనులుగా మారారటూ సొంత పార్టీ వారే పెదవి విరుస్తున్నారు. ఆశలు పెట్టుకున్న నేతలే పార్టీకి భారంగా మారుతున్నారని విమర్శలు గుప్పిస్తున్నారు. పార్టీ కోసం వారు పనిచేయరు ..ఇంకెవరినీ పనిచేయనీయడం లేదని తెగ ఫీల్ అయిపోతున్నారు.

సామాజికంగా, ఆర్థికంగా బలమైన పునాదులు ఉన్న సీనియర్లు

నాడు వైసిపి అధికారంలో ఉండగా పదవులు అనుభవించిన నేతలే , నేడు పార్టీ కష్టకాలంలో దూరంగా ఉండటం తీవ్ర విమర్శల పాలవుతోంది. శ్రీకాకుళం జిల్లా రాజకీయాలలో ఉద్దండులుగా పేరున్న ధర్మాన సోదరులు , తమ్మినేని సీతారాం.. ఈ ముగ్గురు వైసిపికి బలం. సామాజికంగా , ఆర్థికంగా బలమైన పునాదులు ఉన్న నేతలు. ఎన్నో దశాబ్దాలుగా రాజకీయాలు నెరుపుతూ వస్తున్నారు. ఎన్నో ఆటుపోట్లు చవి చూసారు. ఐతే 2024 సార్వత్రిక ఎన్నికల తరువాత మాత్రం ఈ ముగ్గురు నేతలు వైసీపీని పట్టించుకోవడమే మానేశారంట.

పార్టీ లీడర్స్‌కు కూడా అందుబాటులో లేని ధర్మాన ప్రసాదరావు

మరీ ముఖ్యంగా మాజీ మంత్రి ధర్మాన ప్రసాధరావు అసలు రాజకీయాలకే దూరంగా ఉంటున్నారు. కనీసం పార్టీ లీడర్స్‌కు కూడా అందుబాటులో ఉండటం లేదంట . ధర్మాన ప్రసాధరావు తిరిగి పోలిటికల్ గా యాక్టివ్ అవుతారో లేదో కూడా తెలియదు అంటున్నారు ఆయన అనుచరులు . తన మనసులో



ఏం ఉందో బయటకు చెప్పడం లేదంట ధర్మాన ప్రసాదరావు. గత ప్రభుత్వంలో కీలక రెవెన్యూ శాఖ ను నిర్వహించారు. ఎన్నికల సమయంలో నిర్వేదంతో మాటాడిన ధర్మాన , రాజకీయాలలో కొనసాగాలని లేదని వైరాగ్యం ప్రదర్శించారు. దానికి తగ్గట్లే కూటమి ప్రభుత్వం వచ్చాక పల్లెత్తు మాటాడటం లేదు.

ఆరోగ్యపరమైన ఇష్యులతో దూరంగా ఉంటున్నానని చెప్పిన తమ్మినేని

మరో వైపు మాజీ స్పీకర్ తమ్మినేని సీతారాం సైతం పోలిటికల్ మీటింగ్స్ కు , కార్యక్రమాలకు దూరంగా ఉంటున్నారు. కోద్ది రోజుల క్రింతం మీడియా ముందుకు వచ్చిన తమ్మినేని కుటుంబంలో ఆరోగ్యపరమైన ఇష్యూల కారణంగా దూరంగా ఉంటున్నానని తెలిపారు. దీంతో కొంత క్లారిటీ ఇచ్చినట్లు అయినా , ఆయన ప్రాతినిధ్యం వహించిన ఆమదాలవలస నియోజకవర్గం వైసిపి ఇంచార్జ్ పదవి చింతాడ రవికుమార్ కు కట్టబెట్టడంతో తమ్మినేని అధిష్టానం పెద్దలపై కినుక వహించారన్న గుసగుసలు వినిపిస్తున్నాయి.

జగన్‌కు నమ్మిన బంటుగా పేరున్న ధర్మాన కృష్ణదాస్

మరో కీలకనేత వైసిపి ఆవిర్భావం నుంచీ పార్టీలో ఉంటూ అధినేత జగన్ కు నమ్మిన బంటుగా పేరుపడ్డ ధర్మాన కృష్ణదాస్ . వైసీపీ అధికారంలో ఉండగా డిప్యూటి సిఎంగా బాధ్యతలు నిర్వర్తించారు. ప్రస్తుతం ఆయన్ని జగన్ పార్టీ జిల్లా అధ్యక్షుడిగా ప్రకటించారు. అయితే వైసిపి అధినాయకత్వం పిలుపునిచ్చే కార్యక్రమాలను ఏదో చేసాం అంటే చేసాం అన్నట్లు ధర్మాన కృష్ణదాస తూతూ మంత్రంగా కానిచ్చేస్తున్నారంట. జిల్లా కేంద్రంలో పార్టీకి కనీసం నిలువ నీడలేదంట. గతంలో రెండు మూడు చోట్ల ఆఫీసులు నిర్వహించిన వైసిపికి ఇప్పుడు శ్రీకాకుళంలో కార్యాలయమే లేకుండా పోయింది.

పార్టీ బలోపేతానికి కృష్ణదాస్ చేసింది శూన్యమంటున్న క్యాడర్

కూటమి ప్రభుత్వం ఏర్పాడ్డాక వైసీపీ మార్క్ కార్యక్రమం ఒక్కటంటే ఒక్కటి కూడ నిర్వహించలేదంట జిల్లాలో . వైసిసి కార్యకర్తలపై దాడులు జరుగుతున్నా పట్టించుకునే నాధుడు లేడంటూ ఆవేదన చెందుతున్నారు ద్వితీయ శ్రేణి నేతలు. ధర్మాన కృష్ణదాస్ పార్టీకి లాయల్ అంటూ మాటాడటం మినహా , పార్టీ బలోపేతానికి చేసింది శూన్యం అంటున్నారు సొంతపార్టీ నేతలు. ఇలా ఈ ముగ్గురు కీలక నేతలు గడప దాటకపోవడంతో క్యాడర్ నిరుత్సాహానికి గురౌతున్నారట.

రిటైర్‌మెంట్ ప్రకటిస్తే.. కొత్త నాయకత్వం వస్తుందని సూచనలు

అధికారంలో ఉన్నప్పుడు అంతా తామే అన్నట్లు వ్యవహరించిన ఈ సీనియర్ నేతలు , నేడు పార్టీ ఇబ్బందులలో ఉండగా సైలెంట్ మోడ్‌లోకి వెళ్లడం ఏంటని కార్యకర్తలు అసహనం వ్యక్తం చేస్తున్నారు. వయోభారం, ఆరోగ్య సమస్యలతో రాజకీయాలు వద్దనుకుంటే రిటైర్‌మెంట్ ప్రకటించాలని.. అప్పుడు పార్టీకి కొత్త నాయకత్వం దొరుకుతుందని క్యాడర్ అభిప్రాయపడుతోంది. అంతే కాని ఏదీ చెప్పకుండా, సైలెంట్‌గా ఉండిపోతే తమ పరిస్థితి ఏంటని కార్యకర్తలు మండిపడుతున్నారు.

# ఆంధ్ర అయోధ్య ఒంటిమిట్ట రామాలయం..



కడప జిల్లా:ఆంధ్రా అయోధ్యగా... అపర భద్రాద్రిగా గుర్తింపు పొందిన వైఎస్సార్ కడప జిల్లా ఒంటిమిట్ట కోదండ రామాలయంలోని గర్భగుడిలో మనకు ఏకశిలపైన సీతారామలక్ష్మణ విగ్రహాలు కనిపిస్తాయి తప్ప హనుమంతుడి విగ్రహం ఉండదు. ఈ ఆలయ నిర్మాణ సమయానికి రాముడికి హనుమంతుడు పరిచయం కాలేదనీ.. అందుకే ఇక్కడ హనుమంతుడి విగ్రహం లేదనే కథ ప్రచారంలో ఉంది. అయితే ఆలయానికి అభిముఖంగా సంజీవరాయస్వామి పేరుతో ఒంటిమిట్ట క్షేత్రపాలకుడుగా ఆంజనేయస్వామి ఆలయం నిర్మితమైంది. ఈ ఆలయంలో స్వామివారు సీతారామలక్ష్మణులకు ఎదురుగా నిలబడి అంజలి ఘటిస్తున్నట్లుగా ఎత్తైన విగ్రహంతో నిలచి, భక్తులను కాపాడుతూ ఉంటారు.

స్థలపురాణం...

ఈ ఆలయ నిర్మాణానికి సంబంధించి వివిధ కథలు ప్రచారంలో ఉన్నాయి. పద్నాలుగేళ్ల వనవాస సమయంలో రాముడు సీతా లక్ష్మణ సమేతుడై ఈ అరణ్యంలోనూ కొంతకాలం గడిపాడట. ఆ సమయంలో మృకండు, శృంగి అనే మహర్షుల ఆశ్రమం ఇక్కడే ఉండేదట. వాళ్లు చేసే యజ్ఞయాగాలకు రాక్షసులు ఆటంకం కలిగించడంతో రాముడు వాళ్లను హతమార్చి యాగరక్షణ చేశాడట. అందుకు ప్రతిగా ఈ మహర్షులు ఏకశిలపైన సీతారామ లక్ష్మణుల విగ్రహాలను చెక్కించారనీ... అయితే ఆ తరువాత రాముడి భక్తుడైన జాంబవంతుడు ఆలయం నిర్మించి ఆ విగ్రహాలను అందులో ప్రతిష్ఠించాడనీ అంటారు. ఈ ఆలయానికి సంబంధించి మరో కథ కూడా ప్రాచుర్యంలో ఉంది. ఈ ప్రాంతంలో ఒంటడు, మిట్టడు అనే ఇద్దరు అన్నదమ్ములు ఉండేవారట. బోయవాళ్లైన వీళ్లు ఈ అటవీ ప్రాంతాన్ని సంరక్షించేవారు. ఓసారి ఈ ప్రాంతానికి ఉదయగిరిని పాలించే కంపరాజు వచ్చాడు, ఈ అన్నదమ్ములు రాజుకు అన్నిరకాల సేవలు చేయడమే కాక చుట్టూ ఉన్న ప్రాంతాలనూ చూపించారు. ఆ రాజు ఆనందించి ఏదయినా కోరుకోమని అడగగా, ఇక్కడ రామాలయం కట్టించమని కోరారట. రాజు ఈ ప్రదేశాన్ని పరిశీలించి గుడి కట్టేందుకు అవసరమైన నిధుల్ని అందించి ఆ బాధ్యతను వీళ్లకే అప్పగించి వెళ్లిపోయాడు. వీళ్లిద్దరూ ఎంతో భక్తిశ్రద్ధలతో కొన్నేళ్లు కష్టపడి ఈ ఆలయాన్ని నిర్మించారట. వాళ్లిద్దరూ కట్టించడం వల్లే ఈ ఆలయానికి ఒంటిమిట్ట రామాలయం అనే పేరు వచ్చిందని అంటారు. ఆ తరువాత ఉదయగిరి రాజు సోదరుడైన బుక్కరాయలు తన దగ్గరున్న నాలుగు సీతారామలక్ష్మణ ఏకశిల విగ్రహాల్లో ఒకదాన్ని ఈ ఆలయంలో ప్రతిష్ఠించాడని చెబుతారు. ఈ ఆలయంలోని రామతీర్థాన్ని రాముడే సీతకోసం ఏర్పాటు చేశాడని అంటారు. మొదట ఆ తీర్థాన్ని రామబుగ్గ అనేవారనీ.. క్రమంగా అదే రామతీర్థం అయ్యిందనీ చెబుతారు. ఎందరో ఈ ఆలయాన్ని అభివృద్ధి చేసినా... ఆంధ్రావాల్మీకిగా గుర్తింపు పొందిన వావిలికొలను సుబ్బారావు అనే రామభక్తుడు ఈ రామాలయాన్ని పునరుద్ధరించినట్లు చరిత్ర చెబుతోంది. స్వామికి విలువైన ఆభరణాలను సమకూర్చేందుకు ఆ భక్తుడు టెంకాయ చిప్పను పట్టుకుని భిక్షాటన చేసి సుమారు పది లక్షల రూపాయలు సేకరించాడట.

విశేష పూజలు...

మూడు గోపుర ద్వారాలున్న ఈ ఆలయ ముఖద్వారం ఎత్తు సుమారు 160 అడుగులుంటుంది. శేషాచల పర్వత పంక్తిలో ఆదిశేషుని తలభాగంగా తిరుమల క్షేత్రం మధ్యభాగంగా దేవుని గడప (కడప), ఒంటిమిట్ట, అహోబిలం తోకభాగంగా శ్రీశైల క్షేత్రాలను అభివర్ణిస్తారు. దేవుని కడప క్షేత్రాన్ని సందర్శించి తిరుమలకు వెళ్లే భక్తులు ఒంటిమిట్టలోని శ్రీ కోదండ రామాలయాన్ని దర్శించి వెళ్లడం అనాదిగా జరుగుతోంది. ఎత్తైన గోపురాలు, విశాలమైన ఆలయ ప్రాంగణం, సుందరమైన మండపాలు, విజయనగర సామ్రాజ్య వైభవాన్ని తెలిపే రమణీయ శిల్పసంపద ఈ ఆలయాన్ని దర్శించిన భక్తులకు, పర్యాటకులకు కనువిందు చేస్తుంది.ఈ ఆలయాన్ని అద్భుత ధామంగా తీర్చిదిద్దడంలో చోళరాజులు, విజయనగర పాలకులు ఇతోధికమైన కృషి చేశారు. దేవాలయ ముఖమండపంలో రామాయణ, భారత, భాగవతాలలోని వివిధ ఘట్టాలను కనులకు కట్టే శిల్పాలున్నాయి. సీతాదేవికి అంగులీయకాన్ని చూపిస్తున్న హనుమంతుడు, లంకకు వారధిని నిర్మించే వానరులు, శ్రీకృష్ణుడు గోవర్ధనగిరిని పైకెత్తే దృశ్యం, వటపత్రశాయి, శ్రీ కృష్ణుని కాళీయ మర్దనం, నర్తకీమణుల బొమ్మలు ఉన్నాయి.

అలాగే ముఖద్వారంపై దేవతలు, రాక్షసులు క్షీరసాగర మథనం చేసే దృశ్యం, ఒక బొమ్మలో ఏనుగు ఆవు కనిపించేలా చెక్కిన సుందర శిల్పాలు కనువిందు చేస్తాయి. ఆలయ ద్వారపాలకులుగా అంజలి ముద్రతో శోభిల్లే జయవిజయుల శిల్పాలు ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తున్నాయి.

ఆధ్యాత్మిక కేంద్రం

ఇక్కడ స్వామివారి బ్రహ్మోత్సవాలను నిర్వహించడంతోపాటూ శ్రీరామనవమి సమయంలో తొమ్మిది రోజులపాటు ప్రత్యేక ఉత్సవాలను చేస్తారు. చతుర్దశి నాడు కల్యాణం, పౌర్ణమిరోజు రథోత్సవం నిర్వహిస్తారు. బమ్మెర పోతనామాత్యుడు ఒంటిమిట్ట కేంద్రంగా భాగవత రచన చేసి, ఆ కావ్యాన్ని ఒంటిమిట్ట కోదండ రామునికే అంకితం ఇచ్చారట. అందుకే ఒంటిమిట్ట ఆలయంలో పోతన విగ్రహం కూడా ఉంది.

# విశాఖ మేయర్ పీఠం పోరు

విశాఖపట్టణం, గ్రేటర్ విశాఖ మున్సిపల్ కార్పొరేషన్ రాజకీయాలు అనూహ్యమైన మలుపులు తిరుగుతున్నాయి. పోటాపోటీ క్యాంప్ లు నడుపుతున్న టీడీపీ, వైసీపీలు శిబిరాలను విదేశాలకు తరలించాయి. దీంతో మేయర్ హరి వెంకట కుమారి అవిశ్వాస పరీక్ష చుట్టూ ఉత్కంఠ రెట్టింపైంది. గ్రేటర్ మేయర్ పీఠంపై కన్నేసిన టీడీపీ నో కాన్ఫిడెన్స్ నోటీసులు ఇచ్చింది. ఈ మేరకు ఏప్రిల్ 19వ తేదీన ప్రత్యేక కౌన్సిల్ సమావేశం జరగనుంది. ఎక్స్ ఆఫీస్ లో కలిపి మ్యాజిక్ ఫిగర్ 74 కాగా.. గ్రేటర్‌లో బలాబలాలపై కూటమి, వైసీపీ ఎవరి లెక్కలు వాళ్లవి.. బీజేపీ, జనసేనతో కలిసి తమ బలం 61కి పెరిగిందని.. మేయర్ పదవి దక్కించుకోవడం ఖాయం అనే ధీమా టీడీపీలో కనిపిస్తోంది.. అయితే, ఈ నెంబర్ గేమ్ ను వైసీపీ పట్టించుకోవడం లేదు. ఎక్స్ ఆఫీషియోతో కలిపి తమ సంఖ్యా బలం 37గా లెక్కేసుకుని అవిశ్వాసం వీగిపోవడం ఖాయం అనే అంచనాకు వచ్చింది. అటు-, కూటమి.. ఇటు వైసీపీ రెండు చాలా కాన్ఫిడెంట్ గా కనిపిస్తున్నాయి. ఈ నేపథ్యంలో ముందుగానే తన కార్పొరేటర్లను బెంగుళూరు తరలించేసింది. సమయం దగ్గర పడుతున్న తరుణంలో అనూహ్యంగా శిబిరాన్ని శ్రీలంకకు మార్చేస్తోంది. అందరూ కాల్పోయినా కొంత మందిని షిఫ్ట్ చేయడం అనివార్యంగా భావించినట్టు- తెలిసింది. అదే సమయంలో వైసీపీలో గెలిచి ఇటీ-వలకూటమిలో చేరిన కార్పొరేటర్లతో సంప్రదింపులు జరుగుతున్నాయి. ప్రస్తుతం వున్న లెక్క ప్రకారం కూటమికి ఇద్దరు సభ్యులు అవసరం వుంది. దీంతో వైసీపీ పూర్తి స్థాయి వ్యూహం పన్ని అమలు చేస్తోంది.మరోవైపు, సంఖ్యాబలం కాపాడుకోవడం ఇప్పుడు కూటమికి పెద్ద టాస్క్. దీంతో కొన్నిరోజులుగా భీమిలిలో నడుస్తున్న క్యాంప్ ను మలేషియాకు తరలించింది. తొలి ప్రయత్నంలో 26 మంది విదేశాలకు జంప్ అయ్యారు. నిజంగానే మేయర్ ను దించే సంఖ్యాబలం ఉంటే విదేశాల్లో శిబిరాలు ఎందుకో చెప్పాలని వైసీపీ ప్రశ్నిస్తోంది. మేయర్ పై అవిశ్వాసం ప్రకటించిన కూటమి.. ఇప్పుడు డిప్యూటీ-మేయర్ కు నోటీ-సులు ఇచ్చింది. డిప్యూటీ మేయర్ శ్రీధర్ ను తప్పించాలని భావిస్తుండగా.. జనసేన ఓటు కీలకంగా మారింది.. మొత్తం పార్టీకి 11మంది సభ్యులు ఉండగా.. క్యాంప్ రాజకీయాలు వద్దని హైకమాండ్ వారించినట్టు తెలిసింది. అయితే, మేయర్ పై అవిశ్వాసం ఆషామాషీ వ్యవహారం కాదని అర్థం కావడంతో అధికార, విపక్షాలు వ్యూహాలు రాటుదేలుతున్నాయి.

# నెక్ట్స్ మిథున్ రెడ్డే?

విజయవాడ: మూడు సార్లు పిలిచారు. మూడు సార్లు డుమ్మా కొట్టారు. హైకోర్టు చెప్పినా వినలేదు. ఏపీ లిక్కర్ అక్రమాల కేసులో కసిరెడ్డి రాజశేఖర్‌రెడ్డి పదే పదే పారిపోతున్నారు. సీఐడీ నోటీసులను కేర్ చేయకుండా.. సిట్ విచారణకు అటెండ్ కాకుండా.. ముచ్చటగా మూడోసారి కూడా డుమ్మా కొట్టారు. కసిరెడ్డి తీరుపై సీఐడీ సీరియస్‌గా ఉందా? ముందుముందు క్రొకడైల్ ఫెస్టివల్ తప్పదా?

లిక్కర్ మాస్టర్ మైండ్ కసిరెడ్డినే?

అంతా కసిరెడ్డి రాజశేఖర్‌రెడ్డినే చేశారని ఆ పార్టీ మాజీ ఎంపీ విజయసాయిరెడ్డి సూటిగా చెప్పేశారు. ఏపీ లిక్కర్ స్కాంలో కసిరెడ్డినే కీలక సూత్రధారి అని సీఐడీ కూడా భావిస్తోంది. గత ప్రభుత్వంలో ఐటీ సలహాదారుగా పని చేసిన రాజశేఖర్‌రెడ్డి.. జగన్‌కు చాలా క్లోజ్ అంటారు. ప్రభుత్వ మద్యం పాలసీ అంతా ఆయన కనుసన్నల్లోనే జరిగిందని చెబుతారు. ఏపీలో ఏ బ్రాండ్లు అమ్మాలి? ఎంత రేట్‌కు అమ్మాలి? ఎవరి నుంచి కొనాలి? అసలు రేట్ ఎంత? తెరవెనుక డీల్ ఎంత? ఇలా గోల్‌మాల్ యవ్వారమంతా కసిరెడ్డినే నడిపించారని సీఐడీ ఆరోపణ. అందులో నిజానిజాలు విచారించడానికి రమ్మంటే ఆయన మాత్రం రాను రానంటూ మూడుసార్లు తప్పించుకున్నారు. హైకోర్టుకు వెళ్లి రిలీఫ్ కోరుకున్నా.. ముందస్తు నోటీసులు ఇచ్చి.. టైమ్ ఇచ్చి.. ఎంక్వైరీ చేసుకోవచ్చని చెప్పింది. హైకోర్టు ఆదేశాల మేరకు మార్చి 25న సీఐడీ నోటీసులు ఇచ్చింది. ఏప్రిల్ 9న విచారణకు రావాలని పిలిచింది. కానీ, కసిరెడ్డి మాత్రం ఈసారి కూడా డుమ్మా కొట్టారు.

కసిరెడ్డి వస్తే.. వాళ్లకు చిక్కులేనా?

ఎందుకు? రాజశేఖర్‌రెడ్డి అంతగా ఎందుకు భయపడుతున్నారు? సీఐడీ విచారణకు ఎందుకు రావట్లేదు? అడ్డంగా దొరికిపోతాననా? పక్కా ఆధారాలు ఉన్నాయి కాబట్టి.. తెలీదు.. గుర్తులేదు.. మర్చిపోయా.. అనే రొటీన్ డైలాగ్స్ చెప్పడం కుదరదని బెదిరిపోతున్నారా? సీఐడీ ముందుకు వస్తే.. అసలు పెద్దల పేర్లు చెప్పాల్సి వస్తుందనా? వివేకానంద హత్య కేసులో సాక్షులు వరుసగా చనిపోతుండటం చూసి.. తనకు కూడా ఏదైనా జరగరానిది జరిగిపోతుందని హడలి పోతున్నారా? ఇలా అనేక ప్రశ్నలు.

మిథున్‌రెడ్డికి చెక్ పెట్టేందుకేనా?

ఏపీ లిక్కర్ కేసులో ఎంపీ మిథున్‌రెడ్డికి కూడా సిట్ నోటీసులు ఇచ్చింది. విచారణకు సహకరించాలని మిథున్ రెడ్డికి సుప్రీంకోర్టు ఆదేశాలు జారీ చేసింది. మిథున్‌రెడ్డిని విచారించముందే కసిరెడ్డిని ప్రశ్నిస్తే.. ఆయన ఇచ్చిన సమాచారంతో కింగ్ పిన్‌కు చెక్ పెట్టొచ్చనేది సీఐడీ ఆలోచనలా కనిపిస్తోంది. అందుకే, కసిరెడ్డికి మూడుసార్లు నోటీసులు ఇచ్చి ఎంక్వైరీకి రప్పించే ప్రయత్నం చేసినా ఆయన మాత్రం డుమ్మా కొడుతూ వస్తున్నారు. విచారణకు వెళ్లకుండా కసిరెడ్డిని ఎవరైనా అడ్డుకుంటున్నారా? బెదిరిస్తున్నారా? కీలక సూత్రధారిని ఎక్కడైనా దాచేశారు?

# నకిలీ విత్తనాలతో జాగ్రత్త

నిజామాబాద్, ఎవరు విత్తనాలు కొనుగోలు చేసనా, దుకాణాదారు నుంచి పక్కాగా రషీదు తీసుకోవాలని వ్యవసాయాధికారులు హెచ్చరించారు. విత్తనాల విషయంలో రైతులు జాగ్రత్తలు తీసుకోవాలని, లైసెన్స్ కలిగిన ఫర్టిలైజర్ దుకాణాల్లోనే విత్తనాలు కొనుగోలు చేయడంతోపాటు విధిగా బిల్లు తీసుకోవాలని వ్యవసాయాధికారులు సూచించారు. వ్యవసాయ వానాకాలం సీజన్‌లో రైతులకు అందజేసేందుకు విత్తనాలు సిద్దంగా ఉన్నాయని తెలిపారు. వరి, జీలుగు, పెసర, కందులు తదితర విత్తనాలను ఆయా మండలకేంద్రాల్లోని సహకార సంఘాలు ద్వారా రైతులకు పంపిణీ చేయనున్నట్లు తెలిపారు. ప్రైవేటుగా కొనుగోలు చేసేందుకు గానూ హైబ్రీడ్‌కు చెందిన పత్తి విత్తన ప్యాకెట్లు అందుబాటులో ఉన్నాయని చెప్పారు. ఇదిలావుంటే జిల్లాలోధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయడంతో పాటు రైతులకు ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకున్నారు.రైతులు పండించిన ప్రతి ధాన్యంగింజ కొనడానికి అధికారులు ఏర్పాట్లు చేశారు. మండల కేంద్రాల నుంచి ధాన్యం కొనుగోలు చేస్తున్న మిల్లర్లు, ప్రత్యేక సాఫ్ట్‌వేర్‌లో ధాన్యం కొనుగోలు వివరాలు పొందుపరిచేలా చర్యలు తీసుకున్నారు. ప్రతిరోజు ఎంత ధాన్యం వచ్చింది, ఎంత నిలువ చేసింది, రైతులకు ఏ రోజు బిల్లులు చెల్లించనున్నారనే సమాచారాన్ని ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేశారు. ప్రభుత్వం తీసుకుంటున్న చర్యల ఫలితంగా రైతులు ప్రైవేటు వ్యక్తులకు ధాన్యం అమ్మకుండా కొనుగోలు కేంద్రాలకు తరలించడానికే మొగ్గుచూపారు. జిల్లాలో రైతులు పండించిన పంట దళారుల భారీన పడి నష్టపోకుండా చర్యలు తీసుకున్నారు. రైతులు పండించిన పంటను నేరుగా కొనుగోలు కేంద్రాలకు తరలించేలా జిల్లా అధికారులు చర్యలు తీసుకున్నారు. ధాన్యానికి మంచి మద్దతు ధర ఇవ్వడంతోపాటు దళారుల బారిన పడకుండా ప్రభుత్వం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి ధాన్యం కొనుగోలు చేసింది. ధాన్యం కొన్నాక రైతుల బ్యాంకు ఖాతాల్లో డబ్బులు జమ చేస్తారు. ప్రభుత్వం రైతు పండించిన పంటకు గిట్టుబాటు ధర చెల్లిస్తూ ధాన్యాన్ని కొనుగోలు చేసిన వెంటనే రైతు ఖాతాల్లో డబ్బులను జమ చేస్తోంది.

# కవితకు జనసేన గట్టి కౌంటర్: 'జోకర్' అంటూ సెటైర్లు



హైదరాబాద్,బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత, జనసేన పార్టీ మధ్య మాటల యుద్ధం కొనసాగుతోంది. గతంలో పవన్ కళ్యాణ్‌ను కమెడియన్‌గా అభివర్ణించిన కవిత, తాజాగా ఓ పాడ్‌కాస్ట్‌లో ఆయన విశ్వసనీయతను ప్రశ్నించారు. పవన్ కళ్యాణ్ వ్యాఖ్యలను సీరియస్‌గా తీసుకోలేమని, హిందీ భాషా రుద్దనపై ఆయన చేసిన వ్యాఖ్యలను ఆయన స్వయంగా మార్చుకుంటారని కవిత విమర్శించారు. ఈ వ్యాఖ్యలు జనసేన వర్గాలను తీవ్ర ఆగ్రహానికి గురిచేశాయి. దీంతో వారు కవితకు గట్టిగా బదులిస్తున్నారు. జనసేన పార్టీ తన అధికారిక ట్విట్టర్ ఖాతాలో ఒక వీడియోను షేర్ చేసింది. ఆ వీడియోలో కవితను పరోక్షంగా "జోకర్"గా అభివర్ణించారు. పార్టీ షేర్ చేసిన ఎడిటెడ్ వీడియో ద్వారా కూడా ఇదే అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు.పవన్ కళ్యాణ్ ఒకప్పుడు వామపక్ష కార్యకర్తగా ఉండి ఇప్పుడు సనాతనిగా ఎలా మారారని కవిత ప్రశ్నించిన వీడియోను ఉటంకిస్తూ, జనసేన పార్టీ స్పందించింది. "జోకర్లు ఇలానే అర్థం చేసుకుంటారు, కానీ పవన్ కళ్యాణ్ చెప్పింది పూర్తిగా వేరు" అని జనసేన వీడియోతో పేర్కొంది.ఆ వీడియోలో పవన్ కళ్యాణ్ ఎప్పుడూ హిందీ భాషా రుద్దనను సమర్థించలేదని స్పష్టం చేశారు. దక్షిణ భారతదేశ ప్రజలు మనుగడ కోసం కొత్త భాషలు నేర్చుకోవాలని మాత్రమే ఆయన సూచించారని తెలిపారు. కవిత ఈ వ్యాఖ్యను తప్పుగా అర్థం చేసుకుని పవన్ కళ్యాణ్‌పై అవమానకరమైన వ్యాఖ్యలు చేస్తున్నారని జనసేన ఆరోపించింది.జనసేన అధికారిక ట్విట్టర్ ఖాతా నుండి వచ్చిన ఈ వీడియో చాలా తీవ్రంగా ఉంది. కవితకు జనసేన పార్టీ నుండి వచ్చిన బలమైన ప్రతిస్పందనగా దీన్ని పరిగణించవచ్చు. ఈ పరిణామాల నేపథ్యంలో ఇరు పార్టీల మధ్య మరింతగా వివాదం రాజుకునే అవకాశం కనిపిస్తోంది.

# చర్చలకు మా తలుపులు తెరిచే ఉంటాయి..



వాషింగ్టన్, అగ్రరాజ్యం అమెరికా, చైనా మధ్య వాణిజ్య యుద్ధం కొనసాగుతోంది. రెండు దేశాలూ పోటాపోటీగా ఒకరిపై ఒకరు సుంకాలు విధించుకుంటున్నాయి. డ్రాగన్‌పై అమెరికా భారీగా (125 శాతం) ప్రతీకార సుంకాలు విధించిన విషయం తెలిసిందే. ఇక సుంకాలపై అమెరికాతో చైనా ఒప్పందం కుదుర్చుకుంటుందని తాను భావిస్తున్నట్లు ట్రంప్ వ్యాఖ్యానించారు. ఈ విషయంపై చర్చించేందుకు జిన్‌పింగ్ నుంచి మాకు ఫోన్ కాల్ వస్తుందని భావిస్తున్నట్లు అమెరికా అధ్యక్షుడు పేర్కొన్నారు.ట్రంప్ వ్యాఖ్యలపై చైనా తాజాగా స్పందించింది. ఈ మేరకు కౌంటర్ ఇచ్చింది. చర్చలకు తమ తలుపులు తెరిచే ఉంటాయని వెల్లడించింది. తాము ఘర్షణకు ప్రయత్నించబోమని, ఎలాంటి ఒత్తిడిని ఎదుర్కోవడానికైనా వెనుకాడబోమని స్పష్టం చేసింది. 'చైనా వైఖరి స్పష్టంగా, స్థిరంగా ఉంది. కవ్వింపు చర్యలకు భయపడం. అమెరికా మాట్లాడాలనుకుంటే.. మా తలుపులు తెరిచే ఉంటాయి. కానీ పరస్పర గౌరవం, సమానత్వం ఆధారంగా సంభాషణ జరగాలి. ఒత్తిడి, బెదిరింపులు, బ్లాక్‌మెయిల్ వంటివి పనిచేయవు' అని చైనా వాణిజ్య మంత్రిత్వ శాఖ ప్రతినిధి హి యోంగ్కియాన్ అన్నారు.

జిన్‌పింగ్ చాలా స్మార్ట్.. ట్రంప్

చైనా అధ్యక్షుడు షీ జిన్‌పింగ్ పై అమెరికా ప్రెసిడెంట్ డొనాల్డ్ ట్రంప్ ప్రశంసల వర్షం కురిపించారు. జిన్‌పింగ్ చాలా స్మార్ట్ అంటూ పొగడ్తలతో ముంచెత్తారు. 'జిన్‌పింగ్ చాలా స్మార్ట్. తెలివైన వ్యక్తి. ఎప్పుడు ఏం చేయాలో అతనికి బాగా తెలుసు. దేశం అంటే ఆయనకు అమితమైన ప్రేమ. ఆ విషయం నాకు బాగా తెలుసు. సుంకాలపై వాళ్లు అమెరికాతో ఒప్పందం కుదుర్చుకుంటారని నేను అనుకుంటున్నా. త్వరలోనే దీనిపై చర్చించేందుకు జిన్‌పింగ్ నుంచి మాకు ఫోన్ కాల్ వస్తుందని భావిస్తున్నా. దానికి మేం సిద్ధంగా ఉన్నాం' అని ట్రంప్ పేర్కొన్నారు.

చైనాపై 125 శాతానికి చేరిన ప్రతీకార సుంకాలు

మరోవైపు అంతర్జాతీయ మార్కెట్‌లో ఆందోళనలు చెలరేగుతున్న నేపథ్యంలో అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ తన ప్రతీకార సుంకాలపై నిర్ణయాన్ని 90 రోజులపాటు వాయిదా వేశారు. చైనా మినహా అన్ని దేశాలకు ఈ నిర్ణయం వర్తిస్తుంది. చైనాపై మాత్రం వెంటనే పెంచిన సుంకాలు అమల్లోకి రాగా.. తాజా సవరింపులతో డ్రాగన్‌పై ప్రతీకార సుంకాలు గరిష్ఠంగా 125 శాతానికి చేరడం గమనార్హం. గత మార్చి వరకు చైనా వస్తువులపై అమెరికా 10 శాతం సుంకాన్ని విధించింది. ఇటీవల పెంచిన పన్నుతో ఇది 54 శాతానికి చేరుకున్నది. దీనిపై డ్రాగన్ దీటుగా స్పందించింది. ఆ దేశం నుంచి దిగుమతి అయ్యే వస్తువులపై 34 శాతం అదనపు సుంకం విధించాలని నిర్ణయించింది .దీనిపై ఆగ్రహించిన ట్రంప్ టారిఫ్‌ల విషయంలో వెనక్కి తగ్గాలంటూ డ్రాగన్‌కు వార్నింగ్ ఇచ్చారు. మరో 50 శాతం పెంచుతూ నిర్ణయం తీసుకున్నారు. దీంతో టారిఫ్‌లు 104 శాతానికి చేరాయి. అయినా చైనా వెనక్కి తగ్గలేదు. అమెరికాపై 84 శాతం టారిఫ్ విధిస్తున్నట్లు ప్రకటించింది. ఇవి గురువారం నుంచి అమల్లోకి రానున్నాయి. ట్రంప్ హెచ్చరికలను చైనా పెడచెవిన పెట్టడంతో మళ్లీ అదనపు సుంకాల పోటు తప్పలేదు. చైనా నిర్ణయంతో ట్రంప్ బుధవారం మరో 21 శాతం బాదారు. దీంతో చైనాపై ప్రతీకార సుంకాలు 125 శాతానికి చేరింది. మొత్తానికి ఈ పరస్పర సుంకాలతో ఇరు దేశాల మధ్య నెలకొన్న వాణిజ్య యుద్ధం మరింత పెరిగినైట్టెంది.

# కియా చోర్ కౌన్ ? అంతుబట్టని మిస్టరీ



శ్రీ సత్యసాయి జిల్లా : రాయలసీమలోని పెనుకొండ కియా కార్ల కంపెనీలో భారీ సంఖ్యలో ఇంజన్ల చోరీ ఉదంతం.. ప్రపంచంలోని ఆటోమొబైల్ ఉత్పత్తి రంగాన్ని కుదిపేసింది. ఏకంగా 900 ఇంజన్లు ఎలా మాయం అయ్యాయనే అంశంపై .. కార్ల కంపెనీలు తర్జన భర్జన పడుతున్నాయి. ఇక ఈ కేసు మిస్టరీ చేధన ఏపీ పోలీసులకూ అంతు దొరకటం లేదు. ఎందుకంటే కంపెనీ ఇచ్చిన సమాచారంతో.. దర్యాప్తులో కనిపిస్తున్న వాస్తవాల్లో పొంతన కనిపించటం లేదు. ఎందుకంటే.. అంతర్జాతీయ కార్ల కంపెనీల్లో కియా కంపెనీ ఆషామాషీ కాదు. భద్రత విషయంలోనూ రాటుతేలిన సంస్థ ఇది. ఒక గుండుసూది కనిపించక పోతే.. అదెక్కడుందో తన సాంకేతిక పరిజ్ఞానంతో ఇట్టే జల్లెడ పట్టగల సత్తా ఉన్న కంపెనీ ఇది. .ఈ అంతర్జాతీయ స్థాయి కంపెనీలో ఎంటర్‌ప్రైజ్ రిసోర్స్ ప్లానింగ్ (ఈఆర్పీ) , సప్లయ్ చైన్ మేనేజ్ మెంట్ (ఎస్పీఎం) , బార్కోడ్, రేడియో ఫ్రీక్వెన్సీ ఐడీ (ఆర్ ఎఫ్ ఐడీ) వంటి ట్రాకింగ్ సిస్టమ్స్ ఉన్నప్పటికీ ఇంజన్ల దొంగలు ఏ టెక్నాలజీ ఉపయోగించారే ప్రశ్న%ఔ% ఆటో మొబైల్ రంగాన్ని పీడిస్తోంది. అక్కడి వరకూ దేనికి? ఇంజిన్‌లు చిన్నా చితక మోటార్లు కావు. కనీసం సీసీ కెమెరాలు, లోడ్ చెక్ పాయింట్ లు గుర్తించకపోవటమే ఆశ్చర్యాన్ని కలిగిస్తోంది.కంపెనీ లెక్కల ప్రకారం 900 ఇంజన్లు ఒకే సారి అదృశ్యం కాలేదు. విడతల వారీగా మాయమైనట్టు రికార్డులు చెబుతున్నాయి. కానీ స్టాక్ చెకింగ్, ఇంటర్నల్ ఆడిట్లల్లో ఈ ఇంజన్ల లెక్క ఎలా తప్పింది? ఇక్కడే పోలీసులు జుట్టుపీక్కొనే స్థితి ఏర్పడింది. పెనుకొండ మండలంలోని యర్రమంచి పంచాయతీలోని కియా సంస్థ రోజుకు 450 కార్లు ఉత్పత్తి చేస్తోంది. ఇక్కడ ప్రధాన యూనిట్‌తో పాటు 25 కి పైగా అనుబంధ పరిశ్రమలు పనిచేస్తున్నాయి. ఈ నేపథ్యంలో సంస్థ నుంచి సుమారు 900 కార్ల ఇంజిన్‌లు మాయమైనట్లు సంస్థ గుర్తించింది.మార్చి 19న పోలీసులకు కియా ఇండియా కంపెనీ సీఈవో ఫిర్యాదు చేశారు. తమిళనాడు నుంచి పెనుకొండకు కంటైనర్లలో ఇంజన్లు చేరాయి. హ్యుందాయ్ కంపెనీ వీటిని రవాణా చేసింది. దారి మధ్యలో కంటైనర్లను ఆపి ఇంజన్లను దొంగలు అపహరించారనే అనుమానం వ్యక్తమైంది. అదే నిజమైతే చైన్నైలో లోడింగ్, పెనుకొండలో కియా కంపెనీలో అన్ లోడింగ్ లెక్కల్లో తేడాలను సెక్యూరిటీ పట్టేస్తుంది? మరి లెక్కల్లో వ్యత్యాసాలను సెక్యూరిటీ గుర్తించిందా? గుర్తిస్తే ఈ సమాచారాన్ని దాటవేసిందా? నిజానికి ఈ కంపెనీ దగ్గర నిఘావ్యవస్థ అషామాషీ కాదు. సెక్యూరిటీపైనా నిఘా వ్యవస్థ పని చేస్తుంది.

మరి ఇంతకీ దారి మధ్యలో ఇంజన్ల చోరీ కథ నిజమా? కట్టుకథా? అందుకే పోలీసులు చాలా లోతుగా దర్యాప్తు జరుపుతున్నారు. ప్రత్యేకంగా మూడు బృందాలను రంగంలోకి దించారు. ఈ మూడు బృందాలు దేశవ్యాప్తంగా ఈ చోరీ జాడను గుర్తించే పనిలో బిజీబిజీగా ఉన్నారు. కియా మోటార్స్ ఇండియా కంపెనీ మార్కెట్ డిమాండ్ ఆధారంగా యేటా 300,000 నుంచి 400,000 కార్లను ఉత్పత్తి చేయగలదు. గత యాభై ఏళ్లుగా దొంగతనాలను తట్టుకున్న బలమైన కంపెనీ ఇది. తాజా పరిణామంతో ఒక ప్లాంట్ నుంచి ఇంత పెద్ద సంఖ్యలో ఇంజన్లను ఎలా మాయం చేయవచ్చో ? అనే అంశం ప్రస్తుతం తెరమీదకు వచ్చింది.ఇలాంటి చోరీలను ఏరీతిలో అడ్డుకోవాలో పరిశోధన చేయాల్సిన పరిస్థితి ఏర్పడింది. తెర మీదకు నెట్ వర్క్ కుట్ర 2020 నుంచి ఈ దొంగతనాలు వెలుగులోకి రాలేదు. అంటే అంతర్గత సిబ్బంది ప్రమేయంపై అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. ఈ అంతర్గత సిబ్బందిలో అందరూ కొరియన్లే. జపానీలే ఉన్నారు.భారతీయులు ఒక్కరూ లేరు. ఇక పెనుకొండ ప్లాంట్ లో పని చేసే కార్మికుల్లో స్థానికులందరూ అన్ స్కిల్డ్ వర్కర్లే. ఇంజన్ల మాయం వ్యవహారాన్ని గుర్తించే శక్తి కేవలం సెక్యూరిటీ సిబ్బందికే ఉంటుంది. వీరిని కూడా దారి మళ్లించారంటే.. ఇక్కడ నెట్‌వర్క్ తెరమీదకు వచ్చింది. నాలుగు ఇంజన్ల ఇండెంట్ లో , ఐదు డెలివరీ చేసినట్లుగా అనుమానిస్తున్నారు. ఇండెంట్ల ధృవీకరణ ఆధారంగా ఇది ఒక కోణం మాత్రమే. చోరీ వెనుక ఫ్యాక్టరీలో గతంలో పని చేసిన ఉద్యోగుల ప్రమేయంపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.ఈ కీలక సమాచారంతో సహా యాక్సెస్ ఎలా పొందారు? ప్రస్తుత ఉద్యోగులు, ట్రాన్స్‌పోర్ట్ కంపెనీలు ఇందులో భాగస్వామ్యులై ఉండవచ్చని అనుమానిస్తున్నారు. ఈ కాలంలో పదవీ విరమణ చేసిన ఉద్యోగులు సహా,వివిధ షెల్ కంపెనీల ప్రతినిధులపై పోలీసులు దృష్టి పెట్టారు. ఇప్పటికే దారిమధ్యలోనే చోరీ జరిగిందనే అంశంపై .. పెనుకొండ.. చెన్నై మధ్య సీసీ పుటేజీలను తనిఖీ చేస్తున్నారు. ఇక దర్యాప్తు ఎన్ని కోణాల్లో జరిగినా.. ఈ చోరీ వ్యవహారం సాధారణ విషయం కాదు.ఇంటర్నేషన్ థెఫ్ట్ కేసుగా పోలీసులు పరిగణిస్తున్నారు. నిఘా వ్యవస్థకే శఠగోపం నిఘా వ్యవస్థలోనే అష్టదిగ్భంధన అస్త్రాలు కలిగిన కియా కంపెనీకే శఠగోపం పెట్టిన టెక్నాలజీ ప్రస్తుతం చర్చనీయాంశమైంది. ఇంజన్ల మాయం వ్యవహారంలో కనీసం సీసీ కెమెరాలు, లోడ్ చెక్‌లు గుర్తించకపోవడం ఆశ్చర్యం ఇక ఈఆర్పీ, ఎస్పీఎం, బార్కోడ్, ఆర్ ఎఫ్ ఐడీ వంటి ట్రాకింగ్ సిస్టమ్స్ ఉన్నా.. వీటి కళ్లుగప్పిన సాఫ్ట్ వేర్ హ్యాకింగ్ హీరో ఎవరు? ఎందుకంటే కియా కంపెనీలో ఉన్న సాఫ్ట్ వేర్ .. తన ప్రాంగణంలో మాయమైన వస్తువును ఇట్టే పసిగట్టగలదు. ఖండాంతరాలు దాటినా గుర్తించగలదు.ఈఆర్పీ జోలికొస్తే.. అంతే ఎంటర్‌ప్రైజ్ రిసోర్స్ ప్లానింగ్. ఇది హ్యూమన్ రిసోర్స్ శాఖ, ఉత్పత్తి , సప్లై చైన్, ఫైనాన్స్, అకౌంటింగ్ విభాగాలన్నీ సాఫ్ట్‌వేర్ కనుసన్నల్లో సాగుతాయి. ఇది కంపెనీ కార్యకలాపాలను ఏకీకృత దృక్పథంతో పచ్చి నిజాలను వడపోస్తుంది. ఇందులో ఆన్ %-%ప్రెమిసెస్ , క్లౌడ్- బేస్డ్, హైబ్రిడ్ ఈఆర్పీ . ఆన్ ప్రెమిసెస్ ఈఆర్బీ వ్యవస్థ కంపెనీ సర్వర్లలో ఆన్ -లొకేషన్‌లోనే నడుస్తుంది, ఇక క్లౌడ్- బేస్డ్ ఈఆర్బీ మూడవ పక్షం, రిమోట్ సర్వర్‌లో పనిచేస్తుంది. ఈ సాఫ్ట్‌వేర్ అన్ని ఆర్థిక డేటాను నిల్వ చేస్తుంది, పర్యవేక్షిస్తుంది, విశ్లేషిస్తుంది , ఖచ్చితమైన, సకాలంలో పారదర్శక ఆర్థిక నివేదికలను నిర్వహిస్తూనే మెరుగైన నగదు లావాదేవీలు, తక్కువ ఖర్చులు పెరిగిన లాభదాయకతకు దారితీసే అంతర దృష్టిని బహిర్గతం చేయటానికి కీలక పాత్ర పోషిస్తుంది. అంటే.. ఏ ఇంజన్ ఎక్కడ నుంచి వచ్చింది? ఎక్కడకు వెళ్లింది? అనే సమాచారం దీనిలో నిక్షిప్తమవుతుంది. ఎస్పీఎం.. ఆర్ ఎఫ్ ఐడీ కళ్లు కప్పలేరుఆక అత్యంత ప్రాథమిక స్థాయిలో, సప్లయ్ చైన్ మేనేజ్ మెంట్ లో ముడి పదార్థాల సేకరణ నుండి ఉత్పత్తి, తుది గమ్యస్థానానికి డెలివరీ చేసే వరకు ఒక ఉత్పత్తికి వినియోగించిన పరికరాలు , డేటా ఆర్థిక లావాదేవీలకు పక్కా సమాచారం క్రోడీకరిస్తుంది.ఇది సరే.. రేడియో ఫ్రీక్వెన్సీ ఐడెంటిఫికేషన్ టెక్నాలజీలో రేడియో తరంగాలతో ఉత్పత్తులను గుర్తించడానికి ఉపయోగిస్తుంది. వైర్‌లెస్ పరికరంలో ఉన్న సమాచారాన్ని , భౌతిక సంబంధం లేకుండా దృష్టి రేఖ అవసరం లేకుండా దూరం నుండి ట్యాగ్ చేసే పరికరం ఇది. ఆర్ ఎఫ్ ఐడీ సెన్సార్ అనేది విద్యుదయస్కాంత క్షేత్రాలను ఉపయోగించి ఉత్పత్తులను స్వయంచాలకంగా గుర్తించడానికి, ట్రాక్ చేయడానికి ఈ ట్యాగ్ పని చేస్తుంది. ఈ సెన్సార్లు చాలా ఖచ్చితమైనవి, వీటిని జతచేసిన వస్తువు విలువైన డేటాను అందించగలవు. డేటాను అప్‌లోడ్ చేస్తున్నందున, ఒకేసారి పెద్ద సంఖ్యలో ఉత్పత్తుల డేటాను సేకరించడానికి ఉపయోగించినప్పుడు ట్రాన్స్క్రిప్షన్ లోపాలు, డేటాలో నకిలీ తప్పిపోయిన అంశాలను కూడా నివారిస్తుంది. ఇంత గొప్ప టెక్నాలజీ ఉన్న కియా కంపెనీలో 900 ఇంజన్లు మాయం కావటాన్ని అంతర్జాతీయ ఆటోమొబైల్ కంపెనీలు జీర్ణించుకోలేక పోతున్నాయి. అసలు దొంగలెవరో తెలిసే వరకూ ఈ కంపెనీల గుండెదడ ఆగదంటే అతిశయోక్తి కాదు.

# ఓదార్పులతో మళ్లీ జగన్ రాజకీయం



అమరావతి,ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డికి బాగా ఇష్టమైన ఓదార్పు ఇప్పుడు మళ్లీ మొదలు పెట్టారు. కేవలం ఓదార్పుకే పరిమితం కాకుండా ఓదార్పు రాజకీయాలు చేపట్టారు. ఇటీవల కాలంలో ఆయన తన పటాటోపం చూపేందుకు ఓదార్పులను ఎంచుకున్నారు. రాజకీయంగా బలప్రదర్శన చేస్తున్నారు. అంతేగాకుండా పోలీసులను బట్టలూడదీసి కొడతానని అంటున్నారు. ఐదేళ్ల పాటు సిఎంగా పనిచేసిన వ్యక్తి ఇలాంటి మాటలు మాట్లాడి పోలీస్ వ్యవస్థ ప్రతిష్టను దెబ్బతీసారు. గతంలో తన రాజకీయ ప్రస్థానంలో ఆయన ఓదార్పు యాత్రలతో ప్రజల వద్దకు వెళ్లేవారు. అధికారంలో ఉన్నప్పుడు ఎవరు ఆపదలో ఉన్నా వారికి ఓదార్పు దక్కడలేదు. అంగన్‌వాడీలు రెండునెలలుగా సమ్మెచేస్తున్నా కనీసం వారిని ఓదార్చలేదు. అలాగే అమరావతి రైతులను ఐదేళ్లుగా దూరం పెట్టారు. అమరావతి రైతుల నుంచే ఆయన ఓదార్పు మంత్రాన్ని పక్కన పెట్టారు. అప్పుడు ఎలాంటి విషయంలోనూ ఓదార్పును ప్రకటించడం లేదు. అలాగే ఎవరు ఎలాంటి ఆందోళనతో ఉన్నా అస్సలు పట్టించుకోలేదన్న విమర్శలు ఉన్నాయి. పాదయాత్రతో అమరావతి ఉద్యమాన్ని తారాస్థాయికి తీసుకుని వెళ్లినా చడీచప్పుడు లేకుండా పోయింది. అంగన్‌వాడీలు, మున్సిపల్ సిబ్బంది, టీచర్ల ఆందోళన వంటి విషయాల్లో కూడా జగన్ ఏనాడు కూడా ఓదార్పు చేపట్టలేదు. అప్పుడు ఆందోళనలపై ఎక్కడా స్పందించకుండా ఉన్నారు. ఆందోళన చేసిచేసిన అమరావతి రైతులకు కూడా నీరసం వచ్చేలా చేయడంలో జగగన్ విజయం సాధించారనే చెప్పాలి. మొత్తంగా ఐదేళ్లుగా రాజధాని అన్నది లేకుండా చేసుకున్న ఘనత జగన్‌కే దక్కుతుంది. ఇకపోతే సమస్య ఏదైనా ప్రజలు ఆందోళన చేస్తున్నా వారిని పలకరించి ఓదార్చ లేదు. గతంలో ముఖ్యమంత్రి రాజశేఖర్ రెడ్డి ప్రతిరోజూ తన క్యాంప్ కార్యాలయంలో ప్రజలను కలిసి విజ్ఞప్తులు స్వీకరించేవారు. ఆయన కుమారుడు జగన్మోహన్ రెడ్డి ఇందుకు పూర్తి భిన్నంగా పాలనా వ్యవహార శైలి సాగింది. తనకు నచ్చిన లేదా అవసరమైన అతి కొద్దిమంది వ్యక్తులను మినహా ఎవరినీ ఆయన కలవరన్న విమర్శలు ఉన్నాయి. రాజధాని అమరావతికి భూములు ఇచ్చిన రైతులతోపాటు ఇతర వర్గాల ప్రజలు ఆందోళన బాట పట్టినా జగన్మోహన్ రెడ్డి చలించ లేదు. వారిని కలసి ఓదార్చ లేదు. రైతులకు అపాయింట్‌మెంట్ ఇవ్వడానికి కూడా ఆయన ముందుకు రాలేదు. రైతులకు ఏమి కావాలో కనుక్కుని సమస్య పరిష్కరించండని కూడా చెప్పలేదు. వారిని పెయిడ్ ఆర్టిస్టులుగానే చూశారు. రాజధాని విషయమై ప్రజలలో గందరగోళం నెలకొన్నప్పటికీ ఈ విషయంలో ముఖ్యమంత్రిగా జగన్మోహన్ రెడ్డి తాను పట్టిన రాజధానికి మూడు పట్టణాలు అన్న తీరులో కాలం గడిపారు. అధికారంలో లేనప్పుడు రాషట్రమంతా ఓదార్పు చేశారు. ప్రజలు నమ్మి ఓటేశారు. మొత్తంగా సిఎం అయ్యాక జగన్ వైఖరి చాలా మందికి ఆశ్చర్యం కలిగించింది. అంగన్‌వాడీలను ఉద్యోగాల నుంచి తొలగించమని ఆదేశాలు ఇచ్చారే తప్ప పిలిచి మాట్లాడాలని ఎక్కడా చెప్పలేదు. తమ ఆవేదనను ఎవరికి చెప్పుకోవాలో తెలియక అనేకవర్గావారు మదనపడ్డ రోజలు చూశాం. ఇదంతా గతం. ఇప్పుడు మళ్లీ ఓదార్పులు అసవరం. రాజకీయంగా నిలదొక్కుకోవాలంటే నిలవాలి. గెలవాలంటే ప్రజలను ఓదార్చాలి. అందుకే రాప్తాడు పర్యటనలో డ్రామాలకు తెరలేపారు. నానా హంగామా సృష్టించారు. ఓదార్పుగా కాకుండా తన రాజకీయ దర్పం ప్రదర్శించే ప్రయత్నం చేశారు. ఈ క్రమంలో పోలీసులపై నోరు పారేసుకున్నారు. వారిని అనరాని భాషలో తిట్టారు. దీనికి ఓ మాజీ సిఎంగా సిగ్గుపడాలి. విమర్శలకు సమాధానం చెప్పాలి.

### ప్రేమోన్మాది దాడిలో తల్లీ కూతుళ్లకు గాయాలి


విశాఖపట్టణం, విశాఖపట్నంలో మరో ప్రేమోన్మాది చెలరేగిపోయాడు. మధురవాడలో ప్రేమోన్మాది దాడి ఘటన మరువక ముందే మరో ఘటనతో విశాఖ నగరం ఉలికిపాటుకు గురైంది. తాజా ఘటన ఫోర్త్ టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. గాజువాకకు చెందిన యువకుడు అక్కయ్యపాలెం ప్రాంతానికి చెందిన బాలికను ఏడాది నుంచి ప్రేమిస్తున్నాడు. వీరిద్దరూ ఇంటర్ చదువుతున్నారు. ఈ విషయం బాలిక ఇంట్లో తెలిసిపోవడంతో బాలికకు వేరే పెళ్లి సంబంధాలు చూడడం ప్రారంభించారు. విషయం తెలుసుకున్న సదరు యువకుడు బాలిక ఇంట్లోకి చొరబడి తల్లి, కూతురుపై విచక్షణ రహితంగా కత్తితో దాడికి పాల్పడ్డాడు. ఈ ఘటనలో ఇద్దరూ గాయపడ్డారు. యువకుడి దాడి నుంచి కాపాడాలంటూ తల్లి కూతుర్లు ఇద్దరు కేకలు వేయడంతో అక్కడి నుంచి సదరు యువకుడు ఉడాయించాడు. స్థానికులు తల్లీకూతుళ్లను ప్రైవేట్ హాస్పిటల్లో చికిత్స నిమిత్తం చేర్పించారు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకున్న కత్తిని స్వాధీనం చేసుకున్నారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి నిందితుడుని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. కేసు పోలీసుల దర్యాప్తులో ఉంది.

# భారీగా ఉద్యోగుల తొలగింపునకు సిద్ధమైన గూగుల్..




న్యూఢిల్లీ, ప్రపంచ వ్యాప్తంగా టెక్ ఉద్యోగాల కోత క్రమంగా కొనసాగుతుంది. ఆర్థిక అస్థిరతతో గ్లోబల్ మార్కెట్లలో ఒత్తిడి, సుంకాల యుద్ధం, అమెరికాలో ఆర్థిక మాంద్య భయం, వరుస నష్టాలు, ఏఐ వినియోగం పెరిగిపోతుండటంతో..చాలా కంపెనీలు తమ ఖర్చులు తగ్గించుకునేందుకు ట్రై చేస్తున్నాయి. ఇందులో భాగంగా పెద్ద ఎత్తున ఎంప్లాయిస్ ను తొలగిస్తున్నాయి. అయితే, ఈ ఏడాదిలో ఇప్పటి వరకు సుమారు 100 కంపెనీలు దాదాపు 27 వేల మందికి పైగా ఉద్యోగులను తీసేశాయి. తాజాగా గ్లోబల్ టెక్ దిగ్గజం గూగుల్ కూడా లేఆఫ్స్ ప్రకటించింది.అయితే, ఆండ్రాయిడ్ సాఫ్ట్‌వేర్, పిక్సెల్ ఫోన్స్, క్రోమ్ బ్రౌజర్ టీమ్స్ లో పని చేస్తున్న వందలాది మంది ఉద్యోగులకు గూగుల్ కంపెనీ లేఆఫ్‌లు ప్రకటించింది. సంస్థలోని ఓ వ్యక్తి ద్వారా లేఆఫ్స్ విషయం బయటకు వచ్చినట్లు జాతీయ మీడియా తెలిపింది. కాగా, ఎంత మందిపై లేఆఫ్స్ ప్రభావం పడింది అనేది ఇప్పటి వరకు కచ్చితంగా తెలియలేదు. ఇక, గూగుల్ 2024 డిసెంబర్‌లో 10 శాతం మంది ఉద్యోగులకు లేఆఫ్స్ ప్రకటించింది. అంతకుముందు ఏడాది (2023) జనవరిలో సుమారు 12 వేల మంది ఉద్యోగులను తొలగించింది గూగుల్. అయితే, 2025లో సాంకేతిక రంగంలో సుమారు 100 కంపెనీలు 27,762 మంది ఎంప్లాయిస్ ను విధుల నుంచి తొలగించాయి. అంతకు ముందు సంవత్సరం టెక్ రంగంలో 549 కంపెనీలు 1,52,472 మంది ఉద్యోగులను ఇంటికి సాగనంపశాయి.

# నయీమ్ కేసులో రంగంలోకి ఈడీ..



హైదరాబాద్,గ్యాంగ్‌స్టర్ నయీమ్ కేసులో కీలక పరిణామం చోటుచేసుకుంది. నయీమ్ కేసులో ఎన్ఫోర్స్ మెంట్ డైరెక్టరేట్ రంగంలోకి దిగనుంది. నయీమ్ పెద్ద మొత్తంలో అక్రమ ఆస్తులను కూడబెట్టినట్లు అధికారులు గుర్తించారు. పలువురు రాజకీయ నేతలు, వ్యాపారులకు నయీమ్ బినామీగా ఉండి.. వారి లావాదేవీలకు అండగా ఉండి డబ్బుల తరలింపుకు పాల్పడ్డట్లు గుర్తించారు. కాగా 2016, ఆగష్టులో తెలంగాణ పోలీసులు ఎన్‌కౌంటర్‌లో హతం అయ్యాడు నయీమ్.. ఇక, నయీమ్ ఎన్‌కౌంటర్ తర్వాత పెద్ద మొత్తంలో ఆస్తులు వెలుగులోకి వచ్చాయి. నయీమ్‌తోపాటు అతడి భార్యాపిల్లలు, బావమరిది, బినామీల పేరుతో పెద్ద ఎత్తున ఆస్తులను గుర్తించారు. ఈ నేపథ్యంలో ఈడీ అధికారులు నయీమ్ పై మనీలాండరింగ్ కేసు నమోదు చేశారు. తాజాగా ఈడీ చర్యలు ప్రారంభించింది.నయీమ్ కు సంబంధించిన 35 ఆస్తులు జప్తు చేసేందుకు ఈడి చర్యలు చేపట్టింది. 35 ఆస్తులను నయీమ్ కుటుంబ సభ్యులు, సన్నిహితుల పేర్ల మీద రిజిస్ట్రేషన్ చేసినట్లు ఈడి గుర్తింపు.. అక్రమంగా , బలవంతంగా ఈ ఆస్తులను నయీమ్ తమ కుటుంబ సభ్యుల పేర్ల మీద రిజిస్టర్ చేసుకున్నట్టు గుర్తింపు.. 2022 మార్చిలో నయీమ్ ఆస్తులపై మనీ లాండరింగ్ కేసు నమోదు చేసిన ఈడి.. అప్పటి ఐటీ అధికారులు, సిట్ సమాచారంతో ECIR నమోదు చేసిన ఈడి.. ఆస్తులు మొత్తాన్ని నయీమ్ కుటుంబ సభ్యులు హసీనా బేగం ,తహీరా బేగం, సలీమా బేగం, అబ్దుల్ సలీం, అహేలాబేగం, సయ్యద్ నిలోఫర్ ,ఫిర్దోస్ అంజూమ్, మహమ్మద్ ఆరిఫ్ ,హసీనా కౌసర్ పేర్ల మీద రిజిస్టర్ చేసినట్లు ఈడి గుర్తింపు.వీరి పేర్లను %జుజ×= శ్రీశీ% నమోదు చేసిన ఈడి.. పలుమార్లు ఈడి సమన్లు పంపిన స్పందించని కుటుంబ సభ్యులు.. భువనగిరిలో ఉన్న క్రిస్టియన్ గోస్పెల్ మిషన్ సెక్రెటరీ ప్రభాకర్ నయీమ్ పై ఫిర్యాదు.. నయీమ్ కుటుంబ సభ్యుల పేరు మీద అక్రమంగా ఆస్తులను వ్రాయించుకున్నట్లు వెల్లడి.. ఇన్ని కోట్ల ఆస్తులు సంపాదించిన ఐటీ రిటర్న్ ఫైల్ చేయని నయీమ్ కుటుంబ సభ్యులు.. బినామీ ఆక్ట్ కింద హసీనా బేగం పేరు చేర్చి ఆస్తులను ఈడి జప్తు చేయనున్నది.

Printed, Published and Owned by UPPUGALLA SANTHOSH KUMAR H.NO. 10-19/286/1, RAVINDRA NAGAR COLONY, NAGARAM VILLAGE, KEESERA MANDAL, DIST.RANGA REDDY, PIN -500083, TELANGANA, Printed at SRI SAI GRAPHICS 9-52/3, ROAD NO.8, S.V.NAGAR, NAGARAM KEESARA, DIST. RANGA REDDY, PIN -500083, TELANGANA . RNI No : TELTEL/2015/66279 Editor : UPPUGALLA SANTHOSH KUMAR Cell : +918247019090. Email : agranetha@gmail.com